Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 22.08.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 12 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## గాడిన పడని పాలన

- హైదరాబాద్‌ను వదలనంటున్న బాబు
- విజయవాడ రాజధానితో ప్రయోజనం శూన్యం
- కులాల వారీగా చీలిపోతున్న ప్రజలు
- తెలంగాణపై ప్రేమతో సీమాంధ్రకు శాపం



**రాష్ట్ర విభజన జరక్కపోయి ఉంటే ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యుండేవాడు కాదు. ఎందుకంటే తెలంగాణతో కూడిన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంపార్టీ చాలా బలహీనంగా ఉంది. తెలుగుదేశం కంటే టీఆర్‌ఎస్, కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌లే బలంగా కనిపించాయి. కాని రాష్ట్ర విభజన రాజకీయంగా చంద్రబాబుకు ప్రాణం పోసింది.**

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఒక ఆలోచన వచ్చింది. ఈ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్న రాజధాని నగరం హైదరాబాద్‌ను కోల్పోయింది. హైదరాబాద్ ఆదాయం మనకు రాదు. 15వేల కోట్ల లోటు బడ్జెట్. కేంద్రం దయ తలిస్తేనే జీతాలిచ్చే పరిస్థితి. కొత్తరాజధాని నిర్మించాలంటే అనుభవం ఉండాలి. వైకాపా నేత జగన్‌కు పరిపాలన అనుభవం లేదు. అదే చంద్రబాబుకు అయితే అపార అనుభవం ఉంది. కేంద్రం నుండి ఎలాగోలా నిధులు తెచ్చి ఈ రాష్ట్రాన్ని ఒక దారిలో పెట్టగలడని అందరూ భావించారు. ముఖ్యంగా చంద్రబాబు అంటేనే భయపడి చచ్చే ఉద్యోగులు అయితే ఈసారి ఆ ఆలోచనతోనే చంద్రబాబుకు మద్దతుగా నిలిచారు. కొత్త రాష్ట్రాన్ని అనుభవం గల చంద్రబాబు అయితేనే అభివృద్ధి చేయగలడన్న నమ్మకంతోనే ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతీ యువకులు చంద్రబాబుకు ఓట్లేసారు.

కాని రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా చంద్రబాబు పరిపాలన సాగడం లేదు. విభజన మూలంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అభివృద్ధి పట్టాలెక్కించాలనే తపన లేకపోగా తెలంగాణలో తెలుగుదేశంను అధికారంలోకి తేవాలంటున్న చంద్రబాబు ప్రకటనలను చూసి ఆంధ్ర ప్రజలు నీరుగారి పోతున్నారు. తెలంగాణ కోసం పనిచేయడానికా... ఈయనను ఆంధ్రా సీఎంగా ఎన్నుకున్నది అని ఆవేదన చెందుతున్నారు. దెబ్బతిన్న ఏపిని ప్రగతి మార్గం పట్టించాలని, పారిశ్రామిక, ఐటి, వ్యవసాయ రంగాలలో ముందుకు తీసుకెళ్లాలన్న కసే చంద్రబాబులో కనిపించడం లేదు. ఆంధ్ర సీఎంను కావడం నా ఖర్మ అన్నట్లుంది ఆయన వాలకం. ఆయనలోనే ఉత్సాహం లేదు... పనిలో వేగం లేదు... అభివృద్ధి కోసం ఆరాటం లేదు. కలెక్టర్ ఉద్యోగం కోసం ప్రయత్నించిన వాడికి ప్యూన్ ఉద్యోగం వస్తే ఎంత నిరుత్సాహపడతాడో చంద్రబాబు పరిస్థితి కూడా అలాగే వుంది.

డైనమిక్ సీఎంగా పనిచేస్తాడనుకుంటే అందుకు విరుద్ధంగా ఉంటున్నాడు. ఈయన బదులు తెలంగాణ సీఎం కేసీఆర్ డైనమిక్‌గా దూసుకుపోతున్నాడు.

(మిగతా 10వ పేజీలో)



రాజకీయాలలో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవు. ఒక పార్టీ చేసే తప్పిదాలే మరో పార్టీకి వరంగా మారుతుంటాయి. ఒక రాష్ట్రంలో ఒక పార్టీ ఎదగాలంటే అదే రాష్ట్రంలో ఉన్న ఏదో ఒక పార్టీ పతనం కావాలి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి వాతావరణమే నెలకొని వుంది.

- వెంకయ్య దృష్టి పెడితే...

## ఏపీ లోనూ బీజేపీ జెండా

**ప్రస్తుతం ఆంధ్రాలో తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలే బలమైన పార్టీలు. నిన్నటి ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబును నమ్మకపోయినా జగన్ కంటే అతను కొంత మేలనే ఉద్దేశ్యంతోనే ఓట్లేసారు. అంటే ఇక్కడ ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయం లేకపోబట్టే ప్రజలు తెలుగుదేశం వైపు మొగ్గు చూపాల్సి వచ్చింది. నిన్న ఎన్నికల నాటికి బీజేపీ కొంత బలంగా ఉండుంటే నరేంద్ర మోడీ ప్రభంజనంలో రాష్ట్రంలో బలమైనశక్తిగా అవతరించి ఉన్నా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఎందుకంటే అస్సాం, జమ్మూకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో కంటే ఏపిలోనే బీజేపీకి కొంత కేడర్ వుంది. కాని ఆ రాష్ట్రాలలోనే బ్రహ్మాండంగా సీట్లు వచ్చాయి. అంటే ఇక్కడ కేడర్ సొంతంగా, బలంగా పనిచేసి వుంటే ఇంకా మెరుగైన ఫలితాలు వచ్చుండేవి.**

అయినా ముంచుకుపోయిందేమీ లేదు. ఎదగడానికి మనుషులకు అవకాశం వచ్చినట్లే రాజకీయపార్టీలకూ అవకాశాలొస్తుంటాయి. ఏపిలో ప్రబలశక్తిగా ఎదగడానికి బీజేపీకి అలాంటి అవకాశమే ఇప్పుడొచ్చింది. ఉత్తరాది పార్టీగా పేరొందిన బీజేపీకి దక్షిణాది రాష్ట్రాల్లో అంతగా ప్రాధాన్యత లేదు. కాని పాతికేళ్లు పోరాడాక కర్ణాటకలో క్రితంసారి అధికారాన్ని చేపట్టగలిగింది. అక్కడ ఒంటరిపోరాటమే ఆ పార్టీకి కలిసొచ్చింది.

ఆంధ్రాలో ఎంతకాలం తెలుగుదేశం వెనుక వున్నా ఆ పార్టీ మరుగుజ్జుగానే ఉండిపోవాల్సి వస్తుంది. అదే సొంతంగా పోరాడితే వచ్చే ఎన్నికల నాటికైనా బలమైన పక్షంగా ఏర్పడవచ్చు. రాష్ట్ర విభజనతో ఇక్కడ పరిస్థితులు మారాయి. విభజన సమయంలో ఏపికి న్యాయం చేయడం కోసం బీజేపీ నాయకులు వెంకయ్య నాయుడు చేసిన పోరాటం అందరి మనస్సులోనూ నిలిచిపోయింది. ఇప్పుడు రాష్ట్రానికి ఏం న్యాయం చేసినా అది కేంద్రమే చేయాలి. దానిపై బీజేపీ ముద్ర ఉంటుంది.

రాష్ట్రంలో బీజేపీ ఎదగడానికి ఇది మంచి తరుణం. రాష్ట్రంలో కాంగ్రెస్ చచ్చిన శవమే అయ్యింది. తెలుగుదేశం, వైకాపాలలో ఉన్నోళ్లు కూడా అంత సంతోషంగా లేరు. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఓ మంచి రాజకీయ ప్రత్యామ్నాయం కావాల్సి వుంది. వెంకయ్యనాయుడు వంటి సీనియర్ నాయకుడు చొరవ తీసుకుంటే ఐదేళ్లలో బీజేపీ రూపురేఖలు మార్చడం అంత కష్టమేమీ కాదు. ఆ దిశగా ఆయన దృష్టి పెడితే భవిష్యత్‌లో ఇక్కడ బీజేపీ జెండా ఎగరడం ఖాయం.

- నెల్లూరు కార్పొరేషన్

## కొత్త కమిషనర్‌గా ఓబులేశు..?

### పాతిక లక్షల డీల్

### నారాయణ మంత్రం అనుయాయుల తంత్రం

- **వెంకయ్యాజీ మీరైనా దృష్టి పెట్టండి...!**

**అభివృద్ధిలో అధమస్థానం అవినీతిలో ప్రథమస్థానం సంపాదించుకున్న నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌కి శ్యాంసన్ స్థానంలో కడప మునిసిపల్ కమీషనర్‌గా పనిచేస్తున్న ఓబులేశు రానున్నట్లు సమాచారం.**

నెల్లూరు కార్పొరేషనంటే రిజర్వుబ్యాంకుతో సమానం. ఇక్కడ గతంలో జరిగినంత, ప్రస్తుతం జరుగుతున్నంత అవినీతి బహుశా భారతదేశంలో ఏ కార్పొరేషన్‌లోనూ జరగదేమో. ఇక్కడ కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయరు. ప్రజల అవసరాలను పట్టించుకోరు ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, ఆరోగ్యశాఖ అధికారులైతే నెల్లూరు పోస్టింగ్‌తో అపరకుబేర అవతారాలెత్తుతున్నారంటే అతిశయోక్తి కాదేమో. (మిగతా 10వ పేజీలో)



# నెల్లూరు అభివృద్ధిని ఆపగలరా?

**సర్పంచ్‌కు ఒక గ్రామం, జడ్పీటీసీకి ఒక మండలం, ఎమ్మెల్యేకు ఒక అసెంబ్లీ, ఎంపీకి ఒక లోక్‌సభ, ముఖ్యమంత్రికి ఒక రాష్ట్రం, ప్రధానమంత్రికి ఒక దేశం యూనిట్‌గా ఉంటాయి. సర్పంచ్ గ్రామం మొత్తాన్ని అభివృద్ధి చేయాలేగాని, తనకు మెజార్టీ వచ్చిన వార్డులనే అభివృద్ధి చేసుకోవాలనుకుంటే అది అసమానతలకు దారితీస్తుంది.**



ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీకి అధిక స్థానాలు వచ్చిన రాష్ట్రాలకే నిధులు మంజూరుచేసి మిగతా రాష్ట్రాలను చిన్నచూపు చూస్తే అభివృద్ధికి అర్థమే ఉండదు. కుడి చేయి బలంగా ఉండి ఎడమ చేయి చచ్చుగా వుంటే దానిని ఆరోగ్య మనరు. అనారోగ్యమంటారు. దేశాభివృద్ధి కూడా అంతే.... అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే అది దేశాభివృద్ధి అవుతుంది. ఒక రాష్ట్ర ప్రగతికి ఇదే కొలమానం. ఆ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు అభివృద్ధి చెందితేనే ఆ రాష్ట్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందినట్లవుతుంది.

**ఆంధ్రప్రదేశ్‌కి హైదరాబాద్ వంటిది నెల్లూరే. సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఏ జిల్లాకు లేని ప్రత్యేకత నెల్లూరుజిల్లాకు ఉంది. ఏ జిల్లా వారైనా, ఏ రాష్ట్రం వారైనా బ్రతుకుదెరువు కోసం వచ్చిన వారిని ఇక్కడి ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకుంటారు. పని చూపిస్తారు, బ్రతుకు మార్గం ఏర్పరుస్తారు. ఎటువంటి వారైనా స్థిరంగా నివాసం ఉండేందుకు ఇష్టపడేది నెల్లూరు జిల్లానే! ఇన్నేళ్ల పాటు హైదరాబాద్ ప్రజలు ఆంధ్రావాళ్లను ఆదరించారు. అటు వంటి సంస్కృతి కృష్ణ, గుంటూరు జిల్లాలో కనిపించదు. కాని నెల్లూరుజిల్లాలో మాత్రమే ఆ సంస్కృతి ఉంది. కాబట్టి నెల్లూరు అభివృద్ధిని ఉద్దేశ్యపూర్వకంగా ఆపడం ఎవరితరం కాదు.**

శత్రువును, మిత్రుడిని సమంగా చూడగలిగినవాడే నిజమైన పాలకుడు. సమర్థవంతమైన నాయకుడు. దురదృష్టవశాత్తు ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబులో ఆ సమదృష్టి లోపిస్తున్నట్లుగా కనిపిస్తుంది. నిన్నటి ఎన్నికల్లో తన పార్టీకి మెజార్టీ సీట్లు ఇచ్చిన జిల్లాలకే ప్రాధాన్యతనిస్తూ, తన పార్టీకి సీట్లు రాని జిల్లాలపై చిన్నచూపు చూస్తున్నట్లుగా ఉంది. ఆయన విజయవాడ-గుంటూరుల మధ్య రాజధాని పెట్టాలని పదేపదే ప్రకటించడం వెనుక మర్మమిదే! ఆ రెండు జిల్లాల్లో బలంగా సీట్లు వచ్చాయి కాబట్టి అక్కడే రాజధాని పెట్టాలనేది ఆయన నిర్ణయం. ఇందులో సాధ్యాసాధ్యాలను ఆలోచించడం లేదు.

పోనీ, మిగతా అభివృద్ధి పనుల మంజూరు విషయంలోనన్నా అన్ని జిల్లాలను సమంగా చూస్తున్నారా అంటే అదీ లేదు. వైకాపాకు ఎక్కువ సీట్లు వచ్చిన కడప, నెల్లూరు, కర్నూలు జిల్లాలపై సవతి ప్రేమను చూపిస్తున్నాడు. ముఖ్యంగా నెల్లూరుజిల్లా అంటే పగవట్టినట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఉంది. కేంద్రం మంజూరుచేస్తున్న జాతీయ విద్య, వైద్య ఇతర సంస్థల విషయాలలో నెల్లూరుపేరు లేకుండానే చేసారు. జిల్లాలో సుదూర తీరప్రాంతముంది. ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కావాల్సినన్ని అందుబాటులో ఉన్నాయి. భూసేకరణకు పెద్దగా వ్యయం లేకుండా వ్యవసాయ, మత్స్య విశ్వవిద్యాలయాలు, ఎయిమ్స్, ఐఐటి వంటివి ఏర్పాటు చేయవచ్చు. కాని వీటి ఏర్పాటు విషయంలో చంద్రబాబు నెల్లూరు పేరునే పరిగణనలోకి తీసుకోలేదు. మా జిల్లాకు ఇది కావాలని కోరవద్దని నెల్లూరు నాయకులను కూడా చంద్రబాబు ఆదేశించాడని సమాచారం. ఈమధ్య నెల్లూరుజిల్లాకే చెందిన ఓ పారిశ్రామికవేత్త ఈ జిల్లాలో కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి కోరితే, నెల్లూరుజిల్లాలో కాకుండా ఇంకెక్కడైనా పెట్టుకోమని చెప్పాడట! ఈ రాష్ట్ర ప్రభుత్వ వాలకం చూస్తుంటే ఈ 5ఏళ్లలో జిల్లాకు ఒక్క అభివృద్ధి పని కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు. జరుగుతున్న పనులు పూర్తయితే గొప్ప అన్నట్లుగా ఉంది.

రాజకీయాలలో ఓట్లు, సీట్లు శాశ్వతం కాదు. ఈరోజు తెలుగుదేశంకు ఎక్కువ సీట్లు వచ్చిన కృష్ణ, గుంటూరు జిల్లాల్లో రేపు వైకాపాకు ఎక్కువ రావొచ్చు. వైకాపాకు ఈరోజు ఎక్కువ సీట్లు వచ్చిన నెల్లూరు, కడప జిల్లాల్లో రేపు తెలుగుదేశంకు ఎక్కువ రావొచ్చు. కాబట్టి ప్రాంతాలకు, అభివృద్ధికి, ఓట్లకు మధ్య లింకుపెట్టడం తగదు.

### నిన్న ఎక్కించేందుకు ఆరాటం...
## నేడు దించేందుకు పోరాటం



**కేవలం ఆరునెలల వ్యవధిలో మనం నెల్లూరు రాజకీయాల్లో ఎన్నో వింతలు విశేషాలను చూస్తున్నాం. ఈ ఆరునెలల్లోనే రాజకీయ శత్రువులుగా ఉన్నోళ్ళు మిత్రులయ్యారు. మిత్రులుగా ఉన్నోళ్లు శత్రువులయ్యారు. మొన్నటి ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీ చేసినోళ్లు ఇప్పుడు ఒకే పార్టీలో తేలారు. ఇది చాలా విచిత్ర వాతావరణం.**



నెల్లూరునగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా అబ్దుల్ అజీజ్‌ను గెలిపించుకోవడంలో నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలదే ప్రధానపాత్ర. మేయర్ అభ్యర్థిగా అజీజ్‌ను పార్టీ అధినేత జగన్ నిర్ణయించాడు. ఆయన నిర్ణయాన్ని వీళ్లు వ్యతిరేకించలేని పరిస్థితి. ఇక డివిజన్ల టిక్కెట్ల పంపిణీలో అనిల్, శ్రీధర్‌రెడ్డిలతో పాటు మేకపాటి, అజీజ్‌లు కూడా కొన్ని టిక్కెట్లిచ్చారు. మేకపాటి వర్గం టిక్కెట్లన్నీ ఏట్లో వేసినట్లయ్యాయి. అనిల్, శ్రీధర్‌రెడ్డిల అనుచరులు ఎక్కువ సంఖ్యలో గెలిచారు. 54 డివిజన్లున్న నెల్లూరు కార్పొరేషన్‌లో వైకాపా 32 డివిజన్‌లు గెలుచుకుని సత్తా చాటింది.



అయితే మున్సిపల్ ఫలితాల తర్వాత అసెంబ్లీ ఫలితాలు రావడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మేయర్ ఎన్నిక నిర్వహించాల్సి రావడం, ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో మేయర్‌గా అజీజ్ ఎన్నికపై అనుమానాలు కమ్ముకున్నాయి. భారీస్థాయిలో తెలుగుదేశం నాయకులు వైకాపా కార్పొరేటర్లకు వల వేసారు. ఈ వలలో కొందరు కార్పొరేటర్లు పడ్డారు కూడా! అనిల్, శ్రీధర్‌రెడ్డిలిద్దరు అజీజ్ మేయర్ అయితే మాకేంటి, కాకుంటే మాకేంటి అన్న ఉద్దేశ్యంతో వదిలేసి ఉంటే ఖచ్చితంగా ఆరోజు నెల్లూరు మేయర్ పీఠం తెలుగుదేశంపార్టీదే! కాని మేయర్‌గా గెలిచాక అజీజ్ పార్టీ మారుతాడనే పక్కా సమాచారం వారి వద్ద వున్నా కూడా జగన్ మైనార్టీలకిచ్చిన మాటను వమ్ము చేయకూడదనే ఉద్దేశ్యంతో గట్టిగా నిలబడ్డారు. తమ చేయి దాటిన కార్పొరేటర్లను కూడా మళ్ళీ దారిలోకి తెచ్చుకున్నారు. ఒక్క కార్పొరేటర్‌ను కూడా పక్కకు పోనీయకుండా చేసి అజీజ్‌ను మేయర్‌ను చేసారు. ఇందుకోసం ఇద్దరు ఎమ్మెల్యేలు సొంత బంధుత్వాలను, వ్యక్తిగత స్నేహాలను కూడా పణంగా పెట్టాల్సివచ్చింది. ఎవరి కోసమైతే వీరు పోరాడారో ఆ అజీజ్ ఇప్పుడు పార్టీ మారాడు. మొన్నటిదాకా అజీజ్‌ను మేయర్‌ను చేయడానికి ఆరాటపడ్డ ఎమ్మెల్యేలకు ఇప్పుడు అతనిని ఆ పదవి నుండి దించడం సవాల్‌గా మారింది. అజీజ్‌ను పార్టీ మారిన కార్పొరేటర్లను అనర్హులుగా ప్రకటించాలంటూ ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు సరికొత్త పోరాటం మొదలుపెట్టారు. ఈ ప్రయత్నం ఫలిస్తే అజీజ్‌కే కాదు, భవిష్యత్‌లో ఇలా పార్టీలు మార్చాలనుకునే ప్రతి ఒక్కరికీ గుణపాఠం నేర్పినవారవుతారు!

### సోదరులు
## మారేదెప్పుడు?



మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మాట్లాడితే సంచలనం... అలాగే ఏదన్నా పనిచేస్తే అది కూడా సంచలనమే! ఆయన మాటలు తూటాల్లాగా పేలుతాయి. చేసే పనులు కూడా అంతే ఆసక్తిగా ఉంటాయి. వివేకా ఈమధ్య ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడం రాజకీయాలలో సంచలనం కలిగిస్తుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అంపశయ్య మీదుంది. నిన్నటి ఎన్నికల్లోనే ఇది తేలిపోయింది. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ నుండి చాలామంది జారుకోగా, ఆనం సోదరులు మాత్రం అక్కడే ఉండిపోయారు. మునిగే పడవలో ఎందుకు? మా పడవలోకి రమ్మని ఆనం రామనారాయణరెడ్డిని చంద్రబాబు ఎన్నికలకు ముందే పార్టీలోకి ఆహ్వానించారు. కాని ఆరోజు పరిస్థితులు వేరు... చివర్లో ఒక నెల సీఎంగా వచ్చినా వదులుకోకూడదనే ఆశతో ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్‌లోనే ఉండిపోయారు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయాయి. రాజకీయ పరిస్థితులు మారాయి. ఆనం సోదరులు తెలుగుదేశంలోకి పోతారనే ప్రచారం గత కొంత కాలంగా బలంగా వినిపిస్తుంది. ఆనం రామనారాయణకు ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవి ఇస్తారనే ప్రచారం కూడా గుప్పుమంది. ఈ ప్రచారానికి తగ్గట్లే ఆనం సోదరులిద్దరు చంద్రబాబు మీద ఈగ వాలనీయడం లేదు. చంద్రబాబు మీద కాంగ్రెస్ లేదా వైకాపా నాయకులు విమర్శలు చేస్తే తెలుగుదేశం నాయకులకంటే ముందు వీళ్లే తిప్పి కొడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బ్రతుకు, భవిష్యత్ లేదు. ఇప్పటివరకు రామనారాయణ ఒక్కడే పార్టీ మారుతాడనే ప్రచారం వుంది. చంద్రబాబును కలిసాక వివేకాపై కూడా ఆ ప్రచారం ఎక్కువైంది. అయితే పూర్వ క్రమంలో చంద్రబాబు, వివేకా స్నేహితులు. ఆ కోణంలో కలిసారో, లేక రాజకీయ కోణంలో కలిసారో త్వరలోనే తేలుతుంది.

## పట్టని కునుకు... ఫిరాయింపుదారుల్లో వణుకు

న్యాయస్థానాలు పార్టీ ఫిరాయింపుల కేసులపై వెంటనే తీర్పునివ్వాలి. కోర్టులో కేసు వేసినా తీర్పొచ్చే సరికి మనం ముసలివాళ్లం అయ్యుంటాంలే అనే నిర్లక్ష్యధోరణితో నాయకులు ఒంటి మీద చొక్కాను మార్చినంత సులభంగా రాజకీయ పార్టీలను మార్చేస్తున్నారు. రాష్ట్ర, దేశ చరిత్రలో ఇప్పటివరకు ఎంతోమంది నేతలు గెలిచిన తర్వాత పార్టీలు ఫిరాయించారు. ఇలాంటి వారిపై ఇంతవరకు వేటు పడకపోవడంతోనే ఫిరాయింపుదార్లకు బలం చేకూరుతుంది. కాని ఇటీవల మన రాష్ట్రంలో చోటుచేసుకున్న సంఘటనలు మాత్రం ఫిరాయింపుదారుల గుండెల్లో గుర్రాలను పరుగెత్తిస్తున్నాయి. విప్‌ను ధిక్కరించిన ప్రకాశం జడ్పీ ఛైర్మెన్ ఈదర హరిబాబుపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే పార్టీ విప్‌ను ధిక్కరించిన కావలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్యను కూడా హైకోర్టు ఆదేశాల మేరకు అనర్హురాలిగా ప్రకటించారు. ఈ రెండు సంఘటనలు జిల్లాలోని ఫిరాయింపుదారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్‌కు చెందిన 8మంది జడ్పీటీసీలు తెలుగుదేశంలో చేరారు. వీళ్లంతా కూడా వైకాపా విప్‌ను ధిక్కరించి తెలుగుదేశం అభ్యర్థికి అనుకూలంగా ఓటేసారు. విప్ ధిక్కారం క్రింద వీరిపై కూడా వేటు పడే అవకాశం ఉంది.

ఇక నెల్లూరు నగర మేయర్ అజీజ్, ఆయనతో పాటు పార్టీ మారిన 12మంది కార్పొరేటర్లపై కూడా అనర్హత వేటు వేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అజీజ్, మిగతా కార్పొరేటర్ల వ్యవహారం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం క్రిందకు వస్తుంది. విప్ ఉల్లంఘించిన వారిపై వెంటనే వేట్లు పడుతున్నాయి. పార్టీలు ఫిరాయించేవారిపై కూడా ఇంతే వేగంతో వేట్లు పడితే భవిష్యత్‌లో రాజకీయాలలో కొంతన్నా క్రమశిక్షణ మిగిలి ఉంటుంది.

## పెరగనున్న నియోజకవర్గాలు

రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలపడంతో జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరగనుంది. ఓటర్ల దామాషా ప్రకారం జిల్లాలో ఇప్పటికే 10అసెంబ్లీలు ఉండగా మరో నాలుగు అసెంబ్లీలు పెరగనున్నాయి. 2009కు ముందున్న అల్లూరు, రాపూరుతో పాటు వింజమూరు, నెల్లూరుసిటీలో మరొకటి లేదా నాయుడుపేట కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పడే అవకాశముంది. జిల్లాలో ఇప్పటికే గూడూరు, సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలుగా ఉండగా, ఎస్టీ జనాభా అధికంగా ఉన్నందున ఒక నియోజకవర్గం ఎస్టీలకు రిజర్వుడ్ కానుంది. 2019కల్లా పెరిగిన నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

2009కి ముందు జిల్లాలో 11నియోజకవర్గాలుండేవి. ఆ సంవత్సరం జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో అల్లూరు, రాపూరు అసెంబ్లీలు పోయి నెల్లూరురూరల్ ఏర్పాటయ్యింది. చివరకు 10అసెంబ్లీలే మిగిలాయి. ఇప్పుడు పునర్విభజన జరిగితే అవి తిరిగి రావడంతో పాటు మరో రెండు కొత్త నియోజకవర్గాలు పుట్టుకురానున్నాయి.







## అతిరథమహారథులకు వేదికైన వేడుక

# మన సుబ్బరామయ్య మనుమడి నిశ్చితార్థం




కళాబంధు, కళారాధకుడు, ప్రజా నాయకుడు, ప్రజాసేవకుడు, రాజ్యసభ సభ్యులు, నెల్లూరీయుడు డా॥ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ఆగస్టు 17వ తేదీ హైదరాబాద్‌లోని నొవాటెల్ హోటల్‌లో తన మనుమడు రాజీవ్ వివాహనిశ్చితార్థం చిరంజీవి కైవతో జరిపించారు. తాను ఏ కార్యక్రమం చేసినా తనదైన శైలిలో ఆడంబరంగా నిర్వహించే ఆనవాయితీని ఎక్కడా మరువకుండా అత్యంత భారీస్థాయిలో ఈ వేడుకను ఆయన నిర్వహించాడు.

సందీప్‌రెడ్డి – సరితల కుమారుడు రాజీవ్. కోటారెడ్డి – సుప్రజల కుమార్తె కైవలను రాజకీయరంగానికి చెందిన అతిరథ మహారథులతో పాటు సినీరంగ దిగ్గజాలు ఆశీర్వదించారు. రాజీవ్–కైవల పరిచయ కార్యక్రమానికి ముందుగా బొంబాయి కళాకారులచే ప్రదర్శించబడిన "రాధాకృష్ణ" నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది.

సుబ్బరామిరెడ్డి వియ్యంకుడు జి.వి.కె.రెడ్డి దంపతులతో పాటు అల్లుడు సంజయ్ కుమార్తె పింకిరెడ్డిలు అందరికీ సాదరంగా స్వాగతం పలికారు. ఇందిరా సుబ్బరామిరెడ్డి వచ్చిన అతిథులందరినీ ఆప్యాయంగా పలుకరించి ఆహ్వానించారు.

ఈ వేడుకలో సీమాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు స్పీకర్ కోడెల శివప్రసాద్‌తో సహా పలువురు ఆంధ్రప్రదేశ్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావులతో సహా అనేక మంది అధికారులు, రాజకీయ ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలు పాల్గొని రాజీవ్ – కైవలను ఆశీర్వదించారు.

బోనీకపూర్, శ్రీదేవిలతో పాటు తెలుగు సినీ ఇండస్ట్రీకి చెందిన రాఘవేంద్రరావు, రామానాయుడు, చిరంజీవి, కృష్ణంరాజు, వెంకటేశ్, స్నేహ, జమున, బ్రహ్మానందం, మురళీమోహన్, రామ్‌చరణ్‌తేజ వంటి ప్రముఖులంతా ఈ వేడుకకు హాజరైన వారిలో వున్నారు. సుబ్బరామిరెడ్డి, జి.వి.కె. రెడ్డిల కుటుంబసభ్యులతో హాలు కళకళలాడింది. మొత్తం నెల్లూరు శోభంతా హైదరాబాదులోని నొవాటెల్‌లో వుందా అనిపించింది. జిల్లాకుచెందిన అనేకమంది ప్రముఖులు ఈ నిశ్చితార్థ వేడుకలో పాల్గొని రాజీవ్ – కైవలకు తమ అభినందనలు తెలియజేశారు. ఆదిత్య బిల్డర్స్ అధినేత వధువు తండ్రి కోటారెడ్డి కూడా నెల్లూరుజిల్లా వాడు కావడంతో నెల్లూరుజిల్లా ప్రముఖులంతా ఈ వేడుకలో పాల్గొన్నారు. కాబోయే జంటకు 'లాయర్' ఆల్‌ది బెస్ట్.



































## అందరికీ చీవాట్లు

తప్పు చేసిన వారందరికీ చీవాట్లు పెడుతుంది 'లాయర్'. సహజంగా జగన్‌ను సమర్థించే పత్రిక గడిచిన వారం అతని ఒంటెద్దు పోకడలను నిరసించి ఆదర్శ సూత్రాలను అందించింది. జగన్, విజయమ్మల ఏకపక్ష సారధ్యాన్ని ఎత్తిచూపింది. వీరభద్రుడు లగాయతు జూపూడి వరకు పార్టీ మారి గత పార్టీని విమర్శించడం అన్యాయం. అదే జగన్ సీఎం అయ్యుంటే వీళ్లు పార్టీ మారేవారా? నెల్లూరు మేయర్ అజీజ్ విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డాడు. అనిల్, కోటంరెడ్డిలు ఎన్నో సవాళ్లకు ఎదురు నిలిచి అతనిని మేయర్‌ను చేసారు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## వింత ట్రీట్‌మెంట్

ఒక రోగి ఐదు రకాల జబ్బులతో ట్రీట్‌మెంట్ కోసం డాక్టరు వద్దకు వెళ్లాడు. రోగిని అటు త్రిప్పి ఇటు త్రిప్పి సవాలక్ష పరీక్షలు చేసి నెలకు ఒక జబ్బును మాత్రమే నయం చేస్తూ 5నెలల్లో నిన్ను పూర్తి ఆరోగ్యవంతుణ్ణి చేస్తానన్నాడు డాక్టర్. అప్పుడు రోగి ఏమన్నాడంటే నెలకు ఒక జబ్బు నయం చేస్తే ఈలోగా మిగతా జబ్బులు ప్రకోపిస్తే నా గతేంటి? అని. అప్పుడు డాక్టర్ అదంతా నీ కర్మ, నా కర్మ అంతకన్నా నేనేమి చేయలేనన్నాడు. అసలు మీరు డాక్టరా? యాక్టరా? అన్నాడు రోగి. అలా ఉంది సంవత్సరానికి రూ.25వేలు రుణమాఫీ చేస్తానన్న చంద్రబాబు ప్రపోజల్!

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## బెజవాడ కరెక్ట్ కాదు

రాజధాని విషయంలో చంద్రబాబు నాయుడు పూర్తిగా బెజవాడ పైనే ఆధారపడడం సముచితం కాదు. బెజవాడను హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే కుదరదు. హైదరాబాద్ పరిసరాలలో ఈరోజుకు కూడా ఎకరా భూమి 5లక్షల రూపాయలకు దొరుకుతుంది. అదే విజయవాడలో ఎకరా భూమి కొనాలంటే 5కోట్లు కావాలి. బయట ప్రాంతాల వారు వచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టడం కష్టమే.

జి.యస్.రెడ్డి, నెల్లూరు.

# 'ప్రభా'తం

'కలసి వుంటే కలదు సుఖం', 'ఐకమత్యమే మహా బలం'..వంటి సూక్తులు ఏనాటికైనా సార్వజనీనమైనవే. అన్ని కాలాల్లోనూ ఈ మాటలు అందరికీ వర్తిస్తాయి. విభేదాలను, కలహాలను పెంచుకుంటూ, అభివృద్ధికి దూరం కావడం కంటే.. ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి సమస్యలు ఒకరు సహృదయంతో అవగాహన చేసుకుని, కలసికట్టుగా వ్యవహరిస్తే ఎంతటి సమస్యలనైనా ఇట్టే పరిష్కరించుకోవచ్చు. ఎవరైనా సరే, రచ్చల మాటలొదిలేసి చర్చల బాటకొస్తే, మాటామాటా అనుకోకుండా సామరస్యధోరణితో సంభాషించుకుంటే ఎలాంటి ఇబ్బందులనైనా అధిగమించవచ్చు.

ఇప్పుడు సాక్షాత్తూ ఇద్దరు ముఖ్యమంత్రులు ఎన్నుకున్న మంచిబాట ఇదే. రాష్ట్ర విభజన నేపథ్యంలో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కొన్ని వివాదాలు ఏర్పడినప్పటికీ, ఆ వివాదాలు ముదిరి పాకానపడకుండా, సమస్యలను వీలైనంత తేలికగా పరిష్కరించుకునేందుకు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సౌహార్ద్రపు బాటను ఎంచుకోవడం ఎంతైనా శుభపరిణామం. రెండు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను ఇద్దరు నేతలూ ఒకరికొకరు చర్చించుకుని, ఒక అంగీకారానికి రావడం ఇరు రాష్ట్రాల శ్రేయస్సుకు ఎంతో అవసరం కూడా. మొన్నటికి మొన్న అదే జరిగింది. అటు కెసిఆర్, ఇటు చంద్రబాబు నాయుడు ఇద్దరూ గవర్నర్ సమక్షంలో ఎంతో సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరుపుకున్నారు. గవర్నర్ నరసింహన్ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, స్పీకర్లతో సమావేశం నిర్వహించి పరస్పర చర్చలతో, సహకారం, సమన్వయంతో సమస్యల పరిష్కారానికి మార్గం వేశారు. ఆ ప్రయత్నం అత్యద్భుతంగా ఫలించింది. కేవలం ఒకే ఒక్క సమావేశంలోనే ప్రధానమైన మూడు సమస్యల పరిష్కారానికి మార్గాలను సుగమం చేసుకున్నారు. అంతేకాదు, ఇంకా కొరుకుడుపడని పలు సమస్యలను చర్చించి, ఒక అభిప్రాయానికి వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. ఇది రెండు రాష్ట్రాల ప్రగతికి నాందీవాచకమని..ఇది ఎంతైనా ఒక మంచి ముందడుగేనని చెప్పక తప్పదు. ప్రధానంగా కొంతకాలంగా ఒక కొలిక్కిరాక జటిలసమస్యలుగా వున్న ఉద్యోగుల విభజన, అసెంబ్లీలో భవనాల కేటాయింపు సమస్యలు తెరపినపడడం సంతోషించదగిన అంశం. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 9,10 షెడ్యూల్‌లోని సంస్థల విషయంలోనూ చర్చల ద్వారా ఒక పరిష్కారానికి రావడానికి ఇరు రాష్ట్రాల నేతలూ అంగీకారం తెలపడం ఎంతైనా ముదావహం. రెండు రాష్ట్రాల ప్రజలూ తెలుగువారేనని, రెండు రాష్ట్రాల మధ్య కీచులాటల వల్ల ఒరిగేదేమీ లేదని, రెండు రాష్ట్రాల ప్రజలూ అభివృద్ధిని మాత్రమే కోరుకుంటున్నారనే విషయాన్ని గుర్తించాలని గవర్నర్ సూచించడం, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా అందుకు స్పందించి, చర్చలు సంప్రదింపుల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించుకోవడంతో ఈ సమావేశం ఫలప్రదమైంది. వాస్తవానికి రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకూ ఎన్నో సమస్యలు వున్నాయి. అయితే, వాటిని సామరస్యంగా పరిష్కరించుకోకుండా, విభేదాలు..వివాదాలతో కాలయాపన చేసుకుంటూ పోవడం వల్ల ఇరు రాష్ట్రాలకూ ఒనగూరే ప్రయోజనమేమీ వుండదు. ఇరు రాష్ట్రాల ప్రయోజనం దృష్ట్యా ఒకరి సమస్యలు ఒకరు సదవగాహనతో తెలుసుకుని పరిష్కరించుకోవడం మంచి మార్గం. తెలంగాణలో సముద్రం లేదు. అక్కడ పోర్టు లేకపోవడం వల్ల ఎగుమతులు, దిగుమతులకు ఇబ్బందులున్నాయి. తెలంగాణకు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవాలంటే బందరు పోర్టు ఎంతైనా అవసరం. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా హైదరాబాద్‌తో ఎన్నో అవసరాలుంటాయి. అందువల్ల, అటు తెలంగాణవారికీ, ఇటు సీమాంధ్రప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవాల్సిన తక్షణావసరం ఇప్పుడు ఎంతైనా వుంది. ఇద్దరు ముఖ్యమంత్రులూ ఆ మేరకు ఒక ఏకాభిప్రాయానికి రావడం, జటిలమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు మంచిమనసుతో సమాయత్తం కావడం ఎంతైనా ఆహ్వానించదగ్గ పరిణామం. వివాదాల జోలికి పోకుండా, అభివృద్ధిలో ఒకరికొకరు పోటీపడుతూ, ఇరురాష్ట్రాల ప్రగతికి సామరస్యంగా కృషి చేయడం కంటే కావాల్సింది ఏముంటుంది?.. గవర్నర్ పేర్కొన్నట్లు.. నిజంగా ఇది శుభపరిణామమే. విడిపోయినా, రెండు తెలుగు రాష్ట్రాలూ ప్రగతిపథంలో కలసిమెలసి నడిచేందుకు సమాయత్తం కావడం మంచిదే. ఆంధ్రతో స్నేహాన్నే కోరుకుంటున్నామని, భవిష్యత్తులోనూ పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగుతామని కెసిఆర్ పేర్కొనడం మంచి పరిణామమే. అసెంబ్లీ సమావేశాల తేదీల విషయంలోనూ ఒక అవగాహనకు రావడం, నదీజలాల విషయంలోనూ వివాదాలకు పోకుండా నీటిని వినియోగించుకుందామనే భావనకు ఇద్దరు ముఖ్యమంత్రులూ రావడం.. అభివృద్ధిలో పోటీపడుతూ, సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుంటూ, రెండు తెలుగు రాష్ట్రాల అభ్యున్నతికి బాటలు వేసే సంకల్పంతో ఇద్దరు ముఖ్యమంత్రులూ గవర్నర్ సమక్షంలో సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరపడం సంతోషదాయకం. ఇదే సమన్వయం, ఇదే స్నేహం, ఇదే సుహృద్భావ వాతావరణం ఇరు రాష్ట్రాల మధ్య ఎల్లవేళలా కొనసాగితే రెండు రాష్ట్రాలూ ఇక త్వరితగతిన ప్రగతి మార్గం పట్టినట్లేనని ఆశించవచ్చు. ఇదే దారిలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీరే ఆ మంచిరోజులు ఇక వచ్చేస్తున్నట్లేనని భావించవచ్చు. వివాదాలను, విభేదాలన్నిటినీ పక్కకు నెట్టేసి, రెండు రాష్ట్రాల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తూ..రెండు రాష్ట్రాలూ ఎల్లవేళలా సమన్వయంతో వ్యవహరిస్తాయని ఆశిద్దాం. వినూత్న ప్రణాళికలతో, మేలైన పథకాల అమలుతో ఎప్పటికప్పుడు ముందడుగు వేస్తూ ఇరు రాష్ట్రాలూ భావితరాలవారికి ఆదర్శంగా పురోగమిస్తాయని భావిద్దాం!..



### కలసి వుంటే కలదు సుఖం

*రెండు తెలుగురాష్ట్రాల అభ్యున్నతికి బాటలువేసే సంకల్పంతో ఇద్దరు ముఖ్యమంత్రులూ గవర్నర్ సమక్షంలో సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరపడం సంతోషదాయకం. ఇదే సుహృద్భావ వాతావరణం ఎల్లవేళలా కొనసాగితే రెండు రాష్ట్రాలూ ఇక త్వరితగతిన ప్రగతిమార్గం పట్టినట్లేనని ఆశించవచ్చు.*

# 'అంతర్'జాతీయం

- మన దేశంలో 'ఎబోలా' వ్యాధి బాధితులెవరూ లేరని కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ స్పష్టం చేశారు. ఈ నెల 16న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాలి ద్వారా ఈ వ్యాధి వ్యాపించదని, వ్యాధి పీడితులతో సంపర్కం చెందిన వారికే ఈ వ్యాధి వస్తుందన్నారు.
- బ్రిటన్‌లోని ఎసెక్స్‌రేవులో ఒక ఓడలోని కంటైనర్‌లో 35మందిని కనుగొన్నారు. వారందరినీ ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన సిక్కులుగా భావిస్తున్నారు. ఊపిరాడని కారణంగా వీరిలో ఒకరు మరణించారు.
- ఏదైనా పొరుగు దేశం నుండి చొరబాట్లు ఉంటే వాటిని అడ్డుకునేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించారు. అదే సమయంలో సరిహద్దు అవతల నుండి ఎలాంటి ముప్పును ఎదుర్కొనేందుకైనా భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.
- ఇనుప ఖనిజం గనుల కుంభకోణం కేసులో గాలి జనార్ధన్‌రెడ్డి, ఆయన భార్యకు చెందిన 37.86కోట్ల ఆస్తులను నల్లధనం నిరోధక ప్రత్యేక న్యాయస్థానం జప్తు చేసింది.
- పాకిస్థాన్‌తో సాధారణ సంబంధాల పునరుద్ధరణకు ప్రధాని మోడీ తీసుకున్న చొరవకు స్పందించకుండా ఆ దేశం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో పాటు కాశ్మీర్ వేర్పాటు వాదులతో చర్చలు జరుపుతుండడంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇస్లామాబాద్‌లో జరగాల్సిన ఇరు దేశాల విదేశాంగ కార్యదర్శుల స్థాయి చర్చలను రద్దు చేసింది.
- బీహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లాలో కాపలాదారు ఉండే ఓ రైల్వే క్రాసింగ్ వద్ద డెహ్రాడూన్ నుండి గోరఖ్‌పూర్ వెళ్లే రప్తీ-గంగా ఎక్స్‌ప్రెస్ ఆటోను ఢీకొన్న ఘటనలో 20మంది చనిపోయారు. మృతుల్లో 8మంది మహిళలు, 8మంది చిన్నారులు ఉన్నారు.
- రైల్వేలో సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీకరణ, సెమీహైస్పీడ్ రైళ్లు నడిపేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కోసం భారతదేశం చెక్‌రిపబ్లికన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. భారత రైల్వే, చెక్ రైల్వేల మధ్య ఈ నెల 19న ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

# వార్త - వ్యాఖ్య

వార్త :- రాష్ట్రం మధ్యలోనే రాజధాని. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *కొలతలేసి పెడతారా?***

వార్త :- పన్నులు స్థానికంగానే చెల్లించాలి. - ఎన్జీఓ నేత అశోక్‌బాబు.
**వ్యాఖ్య :- *ప్రభుత్వం స్థానికంగా ఉంటే ఆటోమేటిక్‌గా అదే జరుగుతుంది.***

వార్త :- వైద్యుడు కాబోయి ఆర్థికవేత్త అయిన మన్మోహన్. - మన్మోహన్ కుమార్తె పుస్తకంలో వెల్లడి.
**వ్యాఖ్య :- *అలా జరిగుంటే సోనియా ఓ మంచి రిమోట్‌కంట్రోల్‌ను కోల్పోయి ఉండేదేమో!***

వార్త :- ఆరెస్సెస్ హిందూ దేశం. - ఆరెస్సెస్ అధినేత భగవత్.
**వ్యాఖ్య :- *అది చెప్పుకోబల్లేదు. ఈ దేశ పునాదులు అవే!***

వార్త :- ఏకాభిప్రాయంతోనే రాజధాని ఏర్పాటు చేయాలి. - పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి.
**వ్యాఖ్య :- *ఏకాభిప్రాయంతోనే మీ పార్టీ రాష్ట్రాన్ని విభజించిందా?***

వార్త :- చంద్రబాబు ప్రతిపక్షనేతగానే వ్యవహరిస్తున్నారు. - మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ.
**వ్యాఖ్య :- *పదేళ్ల అలవాటు... ఒకట్రెండు నెలల్లోనే పోతుందా?***

వార్త :- భాజపా విజయంలో ప్రతిపక్షానిదే పాత్ర. - అద్వానీ.
**వ్యాఖ్య :- *కీలకపాత్ర వారిదే...***

వార్త :- మంత్రులకు బాబు మార్కులు. అత్యధికులు పరీక్ష తప్పారు.
**వ్యాఖ్య :- *ప్రజలేసిన మార్కుల్లో చంద్రబాబుకు కూడా సున్నాలే!***

వార్త :- రుణమాఫీకి నిధుల వేట. - తెలంగాణ సర్కార్ కసరత్తు.
**వ్యాఖ్య :- *దీని కోసం హైదరాబాద్‌లో వున్న ఆంధ్రావాళ్ల ఆస్తులను లాగేసుకోరుగా!***

వార్త :- హత్యారాజకీయాలపై చర్చకు సిద్ధం. - హోంమంత్రి చినరాజప్ప.
**వ్యాఖ్య :- *చర్చకా? రచ్చకా?***

వార్త :- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేం. - స్పష్టం చేసిన లోక్‌సభ స్పీకర్.
**వ్యాఖ్య :- *ప్రజలే ఇవ్వనప్పుడు మీరేం చేస్తారు.***

# ఉత్తరక్రియలు

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్యచ
తస్మా దపరిహార్యే 2 ర్థేన త్వం శోచితు మర్హసి



జననం : 21-04-1921 మరణం : 16-08-2014

పూజ్యులు, మా ఇంటి దైవం, మా పురోభివృద్ధికి ముఖ్య కారకులు

## శ్రీ దొడ్ల చెంచురామిరెడ్డి గారు

తేది 16-08-2014 శనివారం నాడు స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య : దొడ్ల పద్మావతమ్మ

కుమారుడు - కోడలు :
దొడ్ల శేషారెడ్డి - గిరిజారెడ్డి

కుమార్తె - అల్లుడు :
గునపాటి శాంతమ్మ - రంగారెడ్డి

మనుమలు - మనుమరాళ్లు :
దొడ్ల సుబ్బారెడ్డి - భార్గవిరెడ్డి
దొడ్ల సునీల్‌రెడ్డి - దీపారెడ్డి
బొమ్మిరెడ్డి సురేఖారెడ్డి - డా॥ బి.వి.సతీష్‌రెడ్డి

**పెద్దకర్మ:** తేది 27-08-2014 బుధవారం ఉదయం 9.30 గంటలకు నెల్లూరు, రామ్మూర్తినగర్ మొదటివీధిలోని మా స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# వైభవంగా కృష్ణాష్టమి



ఈ నెల 17న కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాలన్నీ భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. శ్రీకృష్ణుని నామస్మరణలతో ఆలయాలు మారుమ్రోగాయి. ఇంటింటా, వాడ వాడలా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాలు విద్యుద్దీపకాంతులతో శోభాయమానమయ్యాయి. నగరంలోని మూలాపేటలో వున్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, ఇస్కాన్ సిటీ తదితర ప్రాంతాల్లో మరింత శోభాయమానంగా ఈ వేడుకలు నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన శ్రీకృష్ణ అవతార ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ దంపతులు ఆలయానికి విచ్చేసి, స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా, మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆలయ ఛైర్మెన్, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తదితరులు విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, కన్నుల పండువగా పూల అలంకారాలు నిర్వహించారు.

స్టోన్‌హౌస్‌పేటలోని గీతామందిరంలో, సుజాతమ్మ నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో, పప్పులవీధిలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో, చిల్డ్రన్స్ పార్క్ వద్ద వున్న మురళీకృష్ణ మందిరంలో, పప్పుల వీధిలో వున్న కెవిసి ప్లాజాలో వాసవిక్లబ్ వారి ఆధ్వర్యంలో ఇలా నగరంలోని అనేక ప్రాంతాల్లో వున్న ఆలయాల్లో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. పలు చోట్ల ఉట్టిమహోత్సవాలు కోలాహలంగా జరిగాయి. ఈ పర్వదినం సందర్భంగా నగరంలోని పలు విద్యాలయాల్లో చిన్నారులు చూడముచ్చటగా శ్రీకృష్ణుని వేషధారణలతో అలరించారు. కాగా, మరికొన్ని ఆలయాల్లో ఈ నెల 18న కూడా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

# నెల్లూరు కబుర్లు

## సీఎం రాకకు సన్నాహాలు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు మూడోసారి జిల్లాలో అడుగు పెట్టబోతున్నారు. మొదటిసారి శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగానికి ప్రధాని మోడీతో కలిసి వచ్చారు. రెండోసారి నెల్లూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి, ఈ నెల 24న మాత్రం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే 'స్వర్ణయాగం' కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్నారు. చంద్రబాబు హైదరాబాద్ నుండి రేణిగుంటకు విమానంలో వచ్చి అక్కడ నుండి హెలికాప్టర్‌లో వెంకటాచలం చేరుకుంటారు. చంద్రబాబు పర్యటన కోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## నగరాన్ని హరితవనం చేయాలి

**మేయర్ అబ్దుల్ అజీజ్**



నగరం పచ్చదనంతో కళకళలాడేందుకు, నగరాన్ని హరిత వనంగా రూపుదిద్దేందుకు అందరూ కృషి చేయాలని, ఇందులో భాగంగా నగరంలో లక్ష మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందని నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.. ఈ నెల 17న కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన డిఇఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ నెల 24న రాష్ట్రముఖ్యమంత్రి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే కార్యక్రమాలకు విచ్చేస్తున్న సందర్భంగా, నగరంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని, తద్వారా పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తోపాటు, డిఇఓ ఉష, కమిషనర్ శ్యాంసన్, డిప్యూటి కమిషనర్ వీరభద్రరావు, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాపురస్కారాల ప్రదానం

**ముక్కాల ద్వారకానాథ్**



జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న నెల్లూరు ఏ.సి.స్టేడియంలో జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు, వారికి శిక్షణ ఇచ్చిన గురువులకు క్రీడా ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఛైర్మెన్ మరియు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ చెప్పారు. ఈ నెల 19న నెల్లూరులోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంబంధిత అర్హులైన క్రీడాకారులు తమ దరఖాస్తులను నవాబుపేటలోని ఫౌండేషన్ కార్యాలయం, ఇస్కాన్‌సిటీలోని రోషన్ ఇండోర్ స్టేడియం, లేదా ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం ప్రాంగణాలలో ఈ నెల 25లోపు అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 9246777777 నెంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ అధ్యక్షులు రాకేష్ చౌదరి, ఎన్.వి. వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, సురేష్, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో మూడు అదనపు ప్లాట్‌ఫాంలు

నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ చాలా ఇరుకుగా ఉంటుంది. 22ప్లాట్‌ఫారంలే ఉన్నాయి. కాని బస్సుల రద్దీ మాత్రం ఎక్కువగా ఉంటుంది. ఒక బస్సు ప్లాట్‌ఫాంలో ఉంటే మరో బస్సు దాని వెనుక వెయిటింగ్‌లో ఉండే పరిస్థితి. ఈ రద్దీ దృష్ట్యా బస్టాండ్ ఆవరణలో ఉన్న కొద్దిపాటి స్థలాన్నే వాడుకుని మరో మూడు అదనపు ప్లాట్‌ఫాంలను నిర్మించారు. ఈ మూడు ప్లాట్‌ఫాంలను కూడా వెంకటాచలం మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్ళే బస్సులకు కేటాయించారు.

## చవితి చందాల సందడి

వినాయకచవితి రాబోతుంది. నగరంలో ఆయా సెంటర్‌లలో నిర్వాహకులు ఏర్పాట్ల ప్రయత్నాల్లో పడ్డారు. వినాయకచవితి అంటే సంతోషంగా చేసుకునే పండుగ. కాని చాలాచోట్ల ఉత్సవ నిర్వాహకులు భక్తులకు ఆ సంతోషాన్ని మిగలనీయడం లేదు. వినాయకచవితి చందాలతో భక్తులు విసుగెత్తిపోతున్నారు. ఉత్సవాలు చేసే వారితో పాటు ఉత్సవాల పేర్లు చెప్పుకుని కూడా కొందరు దండకాలకు దిగుతున్నారు. ముఖ్యంగా వ్యాపారులను, పారిశ్రామికవేత్తలను, ఆయా సంస్థల యాజమాన్యాలను చందాల పేరుతో బాదేస్తున్నారు.

## కనిపిస్తున్న పోలీసు పని

ఎస్పీగా సెంథిల్‌కుమార్ వచ్చాక జిల్లాలో పోలీసు పనితీరు కనిపిస్తుంది. గత కొన్నేళ్లుగా వచ్చిన ఎస్పీలందరూ పోలీసు ఉద్యోగాన్ని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం మాదిరిగా చేయడంతో వ్యవస్థ గాడి తప్పింది. నేర సంస్కృతి పెరిగింది. సెంథిల్‌కుమార్ వచ్చి పోలీసు సిబ్బందిని బాగా తోముతున్నాడు. అందరికీ పనులు పురమాయిస్తున్నాడు. 24గంటలు పనిచేసినా పూర్తి చేయలేనన్ని బాధ్యతలు అప్పగిస్తున్నాడు. కొత్త ఎస్పీ దెబ్బకు పోలీసులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఈమధ్య నెల్లూరు రోడ్ల మీద రాత్రి పగలు తేడా లేకుండా పోలీసులు బాగానే కనిపిస్తున్నారు. ట్రాఫిక్ కూడా కొంచెం దారిలో పడింది. రాత్రి పది గంటలకే వైన్‌షాపులు, బార్లను మూసేయిస్తున్నారు. రాత్రి గస్తీలు ముమ్మరంగా ఉంటున్నాయి. వాహనాల తనిఖీలు ఎక్కువగా ఉండడంతో చైన్‌స్నాచింగ్‌లు తగ్గాయి. మొత్తానికి నెల్లూరులో పోలీసులు బాగా పనిచేస్తున్నారనే వాతావరణం కనిపిస్తుండడం విశేషం.

## బిజెవైఎం కార్యకర్తల శ్రమదానం

నగరంలోని పొదలకూరురోడ్డులో వున్న శ్రీలంక కాలనీ వినాయకుని గుడి వీధిలో ఈ నెల 17న బిజెవైఎం కార్యకర్తలు శ్రమదానం చేసి, అక్కడున్న ముళ్ళ కంపలను తొలగించారు.

బిజెవైఎం అధ్యక్షుడు మన్నెం మధుసూదన్, ఉపాధ్యక్షుడు సుభానీ, కుమార్, ఫయాజ్, మునేంద్ర, అశోక్, గయాజ్, నాగరాజు, నవీన్ తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ప్రతిభకు పట్టాభిషేకం

### విశ్వసాయి విద్యార్థిని శ్రీకావ్యకు జాతీయ స్కాలర్‌షిప్



నెల్లూరు మాగుంటలేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఎంసెట్(మెడిసిన్)లో 22వర్యాంకు సాధించి ప్రస్తుతం తిరుపతిలోని స్విమ్స్‌లో యంబిబియస్ చదువుతున్న అమ్మనబోలు శ్రీకావ్యకు కేంద్ర ప్రభుత్వం శాస్త్రసాంకేతిక మంత్రిత్వశాఖ "డిబిటి బయాలజీ" స్కాలర్‌షిప్ ప్రకటించిందని విశ్వసాయి కళాశాల ఛైర్మెన్ డా॥యన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ కృష్ణమోహన్‌లు ఈనెల 19న తెలిపారు. ఇంటర్మీడియట్‌లో బయాలజీ, బయోటెక్నాలజీ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన దేశంలోని 26రాష్ట్రబోర్డులకు చెందిన 52మంది విద్యార్థులను ఈ స్కాలర్‌షిప్‌కు భారతదేశ ప్రభుత్వ మంత్రిత్వశాఖ ఎంపిక చేస్తుందని, మన రాష్ట్రం నుంచి శ్రీకావ్యను ఎంపిక చేసారని తెలిపారు. శ్రీకావ్య బైపిసి గ్రూపులో ఇంటర్మీడియట్‌లో నూటికి నూరు శాతం మార్కులు సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని, అందువల్లే ఆమెకు ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకావ్య మాట్లాడుతూ తనకు ఈ స్కాలర్‌షిప్ రావడం ఎంతో సంతోషంగా వుందని దానికి కారణమైన విశ్వసాయి కళాశాల అధ్యాపకులకు, ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె ఈ స్కాలర్‌షిప్ కింద రూ॥20,000లు నగదు, బంగారుపతకం, మెరిట్ సర్టిఫికేట్ అందుకోనున్నది. ప్రతిభకు చిరునామాగా నిలిచి నెల్లూరు కీర్తిని జాతీయ స్థాయిలో చాటిన శ్రీకావ్యకు "లాయర్" అభినందనలు.

## విశ్రాంత విఆర్‌ఓలకు పింఛన్లు

విశ్రాంత గ్రామ రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం త్వరలోనే పింఛన్లు మంజూరు చేయనుందని ఏపి విశ్రాంత విఆర్‌ఓల సంఘం కార్యదర్శి కోన వెంకటరమణ తెలిపారు. ఈ నెల 17న టౌన్‌హాలులో జరిగిన ఈ సంఘం జిల్లా శాఖ సమావేశంలో ఆయన ఈ విషయం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దేవళ్ళ దశరధరామిరెడ్డి మాట్లాడుతూ, విఆర్‌ఓల పింఛన్ల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ప్రతిస్పందించినందుకు తమ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'రెయిన్‌బో'లో శ్రీకృష్ణ జన్మాష్టమి



శ్రీ కృష్ణజన్మాష్టమి సందర్భంగా నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో ఈనెల 17న శ్రీ కృష్ణుని జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో బాలురు కృష్ణుడు, బాలికలు గోపికల వేషధారణలో కనువిందు చేసారు. చిన్నారులు తమ బుడిబుడి అడుగులతో ఆడి, పాడి ఊయల ఊగి, ఉట్టి కొట్టి అందరినీ అలరించారు. ఈ సంద ర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ కృష్ణుని జన్మ వృత్తాంతం, ఆయన చిలిపి చేష్టలు, గీతసారము గూర్చి పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మసుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లలకు మన సంస్కృతి, సాంప్రదాయాలు తెలియచేయడం ఎంతో అవసరమని, నేటి తరానికి మన పురాణాలు, ఇతిహాసాలు గురించి చెప్పడం ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అరుణాస్వయంప్రభ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటిటియం జాతీయస్థాయి పోటీలు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలో సెప్టెంబరు 27న డిగ్రీ, పి.జి.విద్యార్థులకు క్విజ్, డిబేట్, చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలను ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐఐటిటియం) వారు నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు నోడల్‌ఆఫీసర్ ఎ.వినోదన్ తెలిపారు. పోటీలలో పాల్గొనదలచినవారు వివరాలకు 8712221602, 8712221802 సెల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

## వాహనముల వేలం

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించని కారణంగా నిర్బంధించిన వాహనాలను వేలం వేసేందుకు ఉపరవాణా కమీషనర్ నిర్ణయించినట్టు తెలిపారు. సెప్టెంబరు 7వతేదీ ఉదయం 11గంటలకు నెల్లూరులోని ఉపరవాణా కమీషనర్ కార్యాలయంలో వేలం వేస్తారని ఆసక్తిగల వ్యక్తులు రూ॥2,000/- చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

# భద్రత మన బాధ్యత

## - డ్రైవర్లకు ఎస్పీ ఉద్బోధ



ప్రయాణీకుల భద్రతను డ్రైవర్లు తమ ప్రధాన బాధ్యతగా గుర్తించాలని జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరు, దర్గామిట్టలోని స్వర్ణవేదిక కల్యాణ మండపంలో ఆటో, బస్సు, టాక్సీల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని, వారు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఒక్కో డ్రైవర్ చేతిలో ఎంతోమంది ప్రాణాలు ఉంటాయని, అది గుర్తెరిగి క్రమశిక్షణతో వాహనాలు నడపాలన్నారు. ఆటోలు ఓవర్‌లోడ్‌తో వెళ్లకూడదని, డ్రైవర్ పక్కన ఎవర్నీ కూర్చోబెట్టుకోవద్దని హెచ్చరించారు. లైసెన్స్‌లు ఉన్నవారే వాహనాలు నడపాలని, అన్ని అనుమతి పత్రాలు ఉన్న వాహనాలే రోడ్లపై తిరగాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఆటోపైనా గుర్తింపు కార్డు ఉండాలని అందులో పోలీసు నెంబర్, ఏరియా నెంబర్, డ్రైవర్ ఫోటో ఉండాలని సూచించారు. అలాగే సిటీ బస్సులను అడ్డదిడ్డంగా నిలిపితే సహించేది లేదని, నిర్ణయించిన స్టాపింగ్స్‌లలో మాత్రమే వాటిని ఆపాలని హెచ్చరించారు. జాతీయ రహదారి మీద ఆటోలను నడిపితే వాటిని సీజ్ చేయడమే కాక కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. రాత్రి వేళలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌ల నుండి ఇళ్లకు వెళ్లే మహిళా ప్రయాణీకులతో డ్రైవర్లు అసభ్యంగా ప్రవర్తించడం, దోపిడీలకు పాల్పడడం చేస్తే తాటతీస్తానని ఆయన ఘాటుగా చెప్పారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రెడ్డిగంగాధర్, డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, ఆర్టీఓ రాంప్రసాద్, ఆర్టీసీ డిఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుపై ప్రభుత్వం కక్ష కట్టింది

## - ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

అసెంబ్లీ సమావేశాల్లో మన జిల్లా ప్రజల సమస్యలను అసెంబ్లీలో విన్పించి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అసెంబ్లీలో జిల్లా ప్రజల వాణిని వినిపిస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

ఈ నెల 16న ఆయన రూరల్ నియోజకవర్గంలోని కందమూరు, కొమ్మరపూడి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరుకు ఒక్క కొత్త పరిశ్రమ కూడా రావడం లేదని, దీన్నిబట్టి చూస్తే జిల్లాపై రాష్ట్రప్రభుత్వం కక్ష కట్టినట్లు అనుమానం వస్తోందన్నారు. దుగరాజపట్నం పోర్ట్ రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. నగరానికి వరంగా మారాల్సిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ సక్రమంగా లేకపోవడం వల్ల అనేక ప్రాంతాల ప్రజలు కలుషిత నీటిని తాగాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ఆర్ ప్రారంభించిన వైఎస్సార్ నగర్‌లో ఇళ్ళ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. నాసిరకంగా నిర్మాణాలు సాగుతున్నాయని, వీటిపై విచారణ చేపట్టాలని అసెంబ్లీలో కోరుతానన్నారు. రాష్ట్ర విభజనతో సీమాంధ్రతో పాటు, ముఖ్యంగా నెల్లూరు జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ పర్యటన సందర్భంగా ఆయన ఆయా గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రూరల్ మండలాధ్యక్షురాలు కలిగిరమ్మ, వైఎస్సార్‌సిపి రూరల్ మండల కన్వీనర్ వేమిరెడ్డి హరిశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పారిశ్రామికవాడలో పంద్రాగస్టు సంబరం



గౌరవ వందనం స్వీకరిస్తున్న శ్రీసిటీ ఎండి రవీంద్రసన్నారెడ్డి

సామాన్యునికి స్వాతంత్ర్యం లభించిన రీతిలో పారిశ్రామిక వాడ శ్రీసిటీలో ప్రజల సహకారంతోనే పలు పరిశ్రమలు ఏర్పడుతున్నట్లు శ్రీసిటీ ఎండి రవీంద్రసన్నారెడ్డి పేర్కొన్నారు.

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ నెల 15వ తేదీన ఇక్కడ స్వాతంత్ర్య సంబరం జరిగింది. పెద్దపెద్ద పట్టణాల్లో జరిగే విధంగా శ్రీసిటీలో ఈ వేడుకలు జరగడం ఈసారి విశేషం. ఈ కార్యక్రమాలలో శ్రీసిటీ ఎండి రవీంద్రసన్నారెడ్డి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ అయ్యింది. శ్రీసిటీ ఆవిర్భావం తరువాత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎండి తొలిసారి పాల్గొనగా, అందుకు తగ్గట్టే ఏర్పాట్లు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు రక్షకదళాల గౌరవ వందనాలతో ఒక కొత్త వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా రవిసన్నారెడ్డి మాట్లాడుతూ ఇసుజిలాంటి పెద్ద పరిశ్రమలతో పాటు, కాల్గేట్, పెప్సీ, టీ, కాఫీ తదితర పరిశ్రమలతోపాటు, ఐఎఫ్ఎంఆర్, ఐఐఐటిలాంటి విద్యాసంస్థలు ఇక్కడికి రావడంతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, స్థానికులు ఈ అవకాశాలను వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఐఎఫ్ఎంఆర్, బిజినెస్ సెంటర్‌లో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ గొప్పతనాన్ని చాటారు.

## వెంకన్న దయతలిస్తే...

# పశుక్షేత్రానికి పండుగశోభ




కొండాపురం మండలంలోని చింతలదేవి పశుక్షేత్రం ఈమధ్య బాగా ప్రచారంలోకి వచ్చింది. దీనికి కారణం చింతలదేవి వద్ద వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని జిల్లాలోని అన్ని పార్టీల నాయకులు కోరుతుండడమే. ఈమధ్య వ్యవసాయ శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు కూడా చింతలదేవిని సందర్శించి ఇక్కడ పశుక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు తప్పితే వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. అయితే కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు దయతలిస్తే చింతలదేవి పశుక్షేత్రం అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఈ పశుక్షేత్రం అభివృద్ధిపై దృష్టి పెట్టారు. వెంకయ్యనాయుడు ఒకప్పుడు ఇక్కడే ఎమ్మెల్యేగా పనిచేసి వుండడం, ఆయనతో సన్నిహిత సంబంధాలు కలిగి వుండడంతో ఆయన ద్వారానే ఈ క్షేత్రం అభివృద్ధికి నిధులు సాధించేందుకు బొల్లినేని ప్రయత్నిస్తున్నాడు. ఈ పశుక్షేత్రం అభివృద్ధికి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కేంద్రానికి 771కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తుంది. దీనిని దేశంలోనే అరుదైన పశుక్షేత్రంగా తీర్చిదిద్దాలనేది ప్లాన్. ఇందులో ఐదువేల గేదెలు, పదివేల వరకు గొర్రెలు, పొట్టేళ్లు, లక్షవరకు వివిధ రకాల కోళ్లు, ఇంకా పలు పశుజాతులను ఇక్కడ పెంచుతారు. పశువైద్యులు, కాంపౌండర్లకు ఇక్కడే శిక్షణ ఉంటుంది. నాణ్యమైన పాల దిగుబడిని పెంచడంతో పాటు ఇక్కడ నుండే పశువులను ఎగుమతి చేసే విధంగా పశుసంవర్ధకశాఖ చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే పశుక్షేత్రం అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు కాగా అందులో 50లక్షలతో కాంపౌండ్ వాల్‌ను కట్టిస్తున్నారు. మరో 50లక్షల రూపాయలను గడ్డి పెంపకానికి ఖర్చు చేస్తున్నారు. పశు సంవర్ధకశాఖ పంపిన ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించాల్సివుంది. వెంకయ్య అనుకుంటే ఇది పెద్ద సమస్య కాదు. ఆయన గట్టిగా ప్రయత్నిస్తే ఒక మంచి పశుక్షేత్రం మన జిల్లాలో రూపుదిద్దుకుంటుంది.

సింహపురి సమాచారం

# గోడ మీది పిల్లులకు నోటీసులు

జడ్పీ ఎన్నికల్లో గెలిచింది ఒక పార్టీ తరపున ఛైర్మెన్ ఎన్నికల్లో మద్దతు పలికింది మరొక పార్టీ అభ్యర్థికి, ఇదెక్కడి న్యాయం అందుకే ఈ గోడ మీది పిల్లులకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జితేంద్ర నోటీసులు జారీచేసారు. ఈనెల 18న నోటీసులు 8మంది జడ్పీటీసీసభ్యులు అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ తరపున పోటీచేసి జడ్పీటీసీ సభ్యులుగా గెలిచిన పెంచలమ్మ(కావలి), వెంకటనారాయణరెడ్డి (వింజమూరు), కలివెల జ్యోతి(సీతారామపురం), టి.రమేష్(మనుబోలు), ఎస్.కె.సల్మారషీద్(చేజర్ల), ఉప్పల ప్రసాద్‌గౌడ్(కోట), దువ్వూరు భారతి (చిట్టమూరు), ముప్పాల విజేత (దొరవారి సత్రం)లు టీడీపీకి మద్దతు ప్రకటించడంతో వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేసారు. అందువల్ల జడ్పీ సిఇఓ జితేంద్ర వారికి నోటీసులు ఇచ్చారు. వారం రోజుల్లో వీరు రాతపూర్వకంగా నిబంధనల ప్రకారం సమాధానం ఇవ్వాలి. చూద్దాం ఏం జరుగుతుందో! చట్టం తన పని తాను చేసుకుపోతుందో! లేకుంటే రాజకీయమే జోక్యం చేసుకొని వారిపై చర్యలను తల కిందులు చేస్తుందో!

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



శ్రీను గల్పిక

# హైదరాబాద్‌లో కృష్ణుడికి అగచాట్లు

అది ద్వారకా నగరం. ఆరోజు గోకులాష్టమి. ఆరోజు కృష్ణభగవానుడు ఎవరి ఇంట ఉండాలనే దానిపై ఆయన 8మంది భార్యలు ముందురోజే లక్కీడిప్ నిర్వహించారు. దీంట్లో సత్యభామ పేరు రావడంతో ఆయన ఆరోజు సత్యభామ ఇంట వుండి తలస్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని ఫ్లూట్ వాయించుకుంటున్నాడు. ఆ వేణుగానాన్ని వింటూ సత్యభామ తనను తానే మైమరచిపోయింది. అంతలో నారాయణ... నారాయణ... అనే పిలుపు వినిపించింది. కృష్ణుడి గుండెల్లో రాయి పడ్డట్లయ్యింది. ఈ ఫిటింగ్ మాస్టర్ నారదుల వారు ఇలా వస్తున్నారేంటబ్బా... నాకేం తలనొప్పులు తెచ్చిపెట్టడు కదా... అని మనసులో అనుకుంటుండగా ఆయన ఎడమ కన్ను అదరసాగింది. నారదుడు రానే వచ్చాడు. కృష్ణుడు, సత్యభామ ఆయనను సాదరంగా ఆహ్వానించి ఫలహారం తింటారా స్వామీ అని అడిగారు. నారదుడు మనసులో ఈ ఫలహారాలతో నా ఆకలి తీరుతుందా... అందుకు వేరే మార్గం ఉండాలి అనుకుంటూ సత్యభామ మెడవైపు చూసాడు. ఆమె మెడ బోసిపోయి వుంది. నారదుడు ముఖం సంతోషంతో వెలిగిపోయింది. అదేంటి చెల్లెమ్మా, మీ మెడలో ఒక్క డైమండ్ హారం కూడా లేదు. నడుముకు వడ్డాణం ఏమైంది. కెంపులు, మణిహారాలు, వంకీలు ఏమయ్యాయి... అవన్నీ కృష్ణభగవానుడు మీ కోసమే తెచ్చాడు కదా, ఈరోజు కృష్ణాష్టమి... అవన్నీ అలంకరించుకోవచ్చు కదా అని అన్నాడు. ఆ మాటలతో కృష్ణుడు తల పట్టుకున్నాడు. పెట్టాడ్రా స్వామి చిచ్చు అనుకున్నాడు. సత్యభామ వుండి... ఈ డైమండ్ హారాలు, వడ్డాణాలు, నక్లెస్‌లు ఏంటి స్వామి, అవేవీ నేను కొనలేదే అని ఆశ్చర్యంగా అంది. మీరు కొనడమేంటి తల్లి... మొన్న మీ వారు భూలోకానికి వెళ్లి 'కల్యాణ్ జ్యూయలర్స్'లో కొని తెచ్చాడు కదా... అవి మీ కోసం కాదా... ఇంకెవరికోసమబ్బా అంటూ కృష్ణుడి వైపు చూసాడు. అయిపోయాను, ఈరోజుతో నా పని ఫినిష్, ఈ నారదుడు నన్ను బుక్ చేసేసాడు అని కృష్ణుడు ఆందోళన పడుతుండగా... చెప్పండి స్వామి, ఎవరి కోసం కొన్నారు ఆ నగలు అని సత్య అడిగింది. కృష్ణుడికి ఇక చెప్పక తప్పలేదు. రుక్మిణికి ఇచ్చానని అసలు విషయం చెప్పాడు. అంతే అరగంట పాటు అక్కడ 'మెకనాస్‌గోల్డ్' సినిమా వాతావరణమే... ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. సత్యభామ అలిగి గదిలోకి వెళ్లి తలుపు గడియ పెట్టేసుకుంది. కృష్ణుడు ఎంత బ్రతిమలాడినా ఆమె అలక వీడలేదు. అప్పుడు కృష్ణుడు... మహానుభావా... మా మధ్య మంట పెట్టింది మీరే, దానిని ఆర్పివేసే మార్గం చెప్పి పుణ్యం కట్టుకోండని బ్రతిమాలాడు. దానికి నారదుడు, ఏముంది కృష్ణా, ఈరోజు ఎలాగూ గోకులాష్టమి కదా... సరదాగా సత్యను కూడా తీసుకుని భూలోకానికి వెళ్లి షాపింగ్ చేసుకుని రండి, భూలోకాన్ని చూసినట్లుంటుంది, ఆమె అలకను తీర్చినట్లుంటుంది అని సలహా ఇచ్చి తన ఆకలి కంటే ఆహారం ఎక్కువ కావడంతో నారదుడు 'జెల్యుసిన్' సిరప్ తాగి బయలుదేరాడు.

★★★★★

కృష్ణుడు సత్యతో కలిసి శంషాబాద్ ఎయిర్ పోర్టులో తన పుష్పక విమానంలో దిగాడు. అక్కడ నుండి హైదరాబాద్ సిటీలోకి టాక్సీలో బయలుదేరాడు. లక్డీకాపూల్ ప్రాంతంలో కొందరు తెలంగాణవాళ్లు కృష్ణుడి కారును ఆపారు. ఇక్కడ సర్వే జరుగుతుంది. మీది లోకలా, నాన్‌లోకలా... 1956కు ముందు మీరు ఎక్కడ ఉండేవాళ్లు అని వాళ్లు కృష్ణుడిని అడిగారు. దానికాయన... నేను సర్వాంతర్యామిని నాయనా, లోకల్, నాన్‌లోకల్ అని తేడా నాకు లేదు, ఎక్కడైనా నేనుంటాను అని చెప్పాడు. అందుకు అవతల వ్యక్తి... అలా అంటే కుదరదు, తెలంగాణ బిడ్డలకు మాత్రమే ఇక్కడ ఉండే హక్కుంది. నాన్‌లోకల్స్ అంతా హైదరాబాద్ వదిలిపోవాల్సిందేనని హూంకరించాడు. ఆ మాటలకు కృష్ణుడికి మండింది. నేరుగా కేసీఆర్ వద్దకు వెళ్లాడు. గోకులాష్టమి రోజు అక్కడ జరుగుతున్న సీన్ చూసి ఆయన నోరెళ్ల బెట్టాడు. కేసీఆర్ కృష్ణుడికి పూజ చేయడం లేదు. నిజాం నవాబు ఫోటో పెట్టుకుని పూజిస్తున్నాడు. కృష్ణుడు తట్టుకోలేక... అదేంటి కేసీఆర్ గారు, ఈరోజు గోకులాష్టమి కదా, కృష్ణుడికి కాకుండా ఇంకెవరికో పూజ చేస్తున్నారేంటని అడిగాడు. కృష్ణయ్యను పూజిస్తే నాకేమొస్తుంది. అదే నిజాం నవాబును కొలిస్తే నాలుగు ఓట్లన్నా వస్తాయని కేసీఆర్ అన్నాడు. ఈ లోకల్, నాన్‌లోకల్ గొడవేంటని కృష్ణయ్య అడిగాడు. నాన్‌లోకల్స్ ఎవరు నాకు ఓట్లేసే వాళ్లు కాదు, అందుకే వాళ్లందర్నీ పంపించేందుకే సర్వే పెట్టించానని కేసీఆర్ చెప్పాడు. ఈ మూర్ఖుడితో మాట్లాడి లాభం లేదనుకుని కృష్ణుడు చంద్రబాబు ఇంటికి వెళ్లాడు. అక్కడ పరిస్థితి చూసి కృష్ణుడు అవాక్కయ్యాడు. ఆయన ఇంట్లో ఎటువంటి పండుగ వాతావరణం లేదు. చంద్రబాబు ఓ మూల సోఫాలో కూర్చుని దిగాలుగా ఉన్నాడు. పండుగరోజు అలా విచారంగా ఉన్నారేమని కృష్ణుడు అడిగాడు. అందుకు చంద్రబాబు... ఇలా ఉండక ఎలా ఉండ మంటారు. పెళ్లై శోభనం జరగనట్లుగా వుంది నా పరిస్థితి. ఏపికి సీఎంను నేను... కాని ఆ ఫీలింగ్ లేదు. నాకు ఆఫీసు లేదు. ఇచ్చిన ఆఫీసులో కుర్చీలు, బల్లలు లేవు. గోడకు సున్న లేదు, సీలింగ్‌కు ఫ్యాన్ లేదు. ఈ హైదరాబాద్‌ను ఇంత అందంగా కట్టించిందే నేను, ఈరోజు నేనే ఇక్కడ సెకండ్ గ్రేడ్ పౌరుడిగా ఉండాల్సి వస్తుంది అని బాధపడ్డాడు. ఇన్ని అగచాట్లు పడే బదులు మీరు విజయవాడలోనే ఉండి పరిపాలన చేయొచ్చుగా అని కృష్ణుడు అన్నాడు. ఆ మాటకు చంద్రబాబు సీరియస్‌గా... అవసరమైతే ఆంధ్రా సీఎం పదవికి రాజీనామా అయినా చేస్తానుగాని, హైదరాబాద్‌ను వదిలే ప్రసక్తే లేదు. తెలంగాణ సీఎం అనే కదా కేసీఆర్ విర్రవీగుతున్నాడు. తెలంగాణలో కూడా మా పార్టీని అధికారంలోకి తెచ్చేదాకా నిద్రపోనన్నాడు. అది విని కృష్ణుడు.. నీ హైదరాబాద్ పిచ్చి పాడుగాను, ఓట్లేసిన ఆంధ్రావాళ్లను వదిలేసి హైదరాబాద్‌ను కలవరిస్తున్నావంటూ... గవర్నర్ నరసింహన్ వద్దకు బయలుదేరాడు.

రాజ్‌భవన్‌లో నిజమైన కృష్ణాష్టమి వేడుకలు జరుగుతున్నాయి. గవర్నర్ నరసింహన్ కృష్ణుడి వేషం వేసి ఫ్లూట్ వాయిస్తున్నాడు. అది చూసి ఒరిజినల్ కృష్ణుడికి తెగ సంతోషమేసింది. కృష్ణుడు ఆయన వద్దకెళ్లి... గవర్నర్ గారు, ఆంధ్రా సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం కేసీఆర్‌ల మధ్య విభేదాలు తారాస్థాయిలో ఉన్నట్లున్నాయి, మీరు జోక్యం చేసుకుని ఇద్దరినీ కూర్చోబెట్టి పరిష్కరించుకూడదు అని కోరాడు. అది విని నరసింహన్... చూడండి స్వామి... వాళ్లిద్దరూ అలా నిప్పు ఉప్పు మాదిరిగా వుంటేనే నాకు చేతినిండా పని ఉంటుంది. వాళ్లు కలిసి పని చేస్తే మధ్యలో నా పాత్రే వుంటుంది. అయినా మీరు చెప్పారు కాబట్టి ప్రయత్నం చేస్తాలే అని అన్నాడు. మీకు చేతి నిండా పని కోసం వాళ్లిద్దరూ కొట్టుకుంటుండాలా... మీకంటే మా నారదుడే నయం... అంటూ అక్కడ నుండి బయలుదేరి జీఆర్‌టి షాపింగ్‌మాల్‌లో సత్యభామకు నగలు కొని, తిరిగి ద్వారకకు పయనమయ్యాడు.

కదంబం

## కోకిలమ్మ పదాలు

అదృష్టదీపక్
రామచంద్రపురం, 9440528155.

మేధావి శాతాలు
తగ్గే ఉపాయాలు
విద్యావిధానాలు
ఓ కోకిలమ్మా!

బుక్స్ మోతకు బరువు
భావిభద్రత కరువు
గుండె కాదా చెరువు
ఓ కోకిలమ్మా!

నిరంతర శ్రామికులు
పరభాష ప్రేమికులు
కాన్వెంటు కార్మికులు
ఓ కోకిలమ్మా!


మోకాలే నేస్తాలు
రేపటి గుమాస్తాలు
బిగిలేని హస్తాలు
ఓ కోకిలమ్మా!

అమెరికన్ డాలర్లు
వేటాడు జాలర్లు
గ్రీన్‌కార్డ్ హోల్డర్లు
ఓ కోకిలమ్మా!

పచ్చకార్డుల మోజు
పిచ్చిముదిరిన రోజు
ఎదకు పట్టును బూజు
ఓ కోకిలమ్మా!

అమెరికాలో కొలువు
సంపాదనకు నెలవు
మమతలకు ఇక సెలవు
ఓ కోకిలమ్మా!

### డా॥నాగభైరవ అవార్డు కోసం
## ఉత్తమ కవితా సంపుటాలకు ఆహ్వానం



ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న డా॥నాగభైరవ అవార్డుకు ఈ ఏడు కూడా వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు అవార్డు కమిటీ అధ్యక్షులు ప్రసిద్ధ సినీ రచయిత వెన్నెలకంటి, ప్రధాన కార్యదర్శి ప్రముఖ కవి చిన్ని నారాయణ రావులు 2012, 2013సంవత్సరాలలో ప్రచురితమైన వచన కవితా సంపుటాలను మూడింటిని అక్టోబరు 1వతేదీలోగా చిన్ని నారాయణరావు, ప్రధానకార్యదర్శి, డా॥నాగభైరవ అవార్డు కమిటీ, రూం.నెం.14, కె.ఏ.సి ప్లాజా, ఆర్.ఆర్.వీధి, నర్తకి థియేటర్ ప్రక్కన, నెల్లూరు-524001 చిరునామాకు పంపమని వారు కోరారు. ఉత్తమ కవితాసంపుటానికి రూ॥5000/- నగదు బహుమతితో సత్కరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఈ అవార్డును డా॥మల్లెమాల, దర్భశయనం శ్రీనివాసాచార్య, రసరాజు వంటి విశిష్ట సాహితీ ద్రష్టలు అందుకున్నారు. ఈ అవార్డు పొందడం గర్వకారణంగా భావిస్తోంది సాహితీలోకం. వివరాలకు 94402 02942నెంబరులో సంప్రదించగలరు.

## “లయన్స్” వస్త్రదానం



బాలాజీనగర్ లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని వారి ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం చేసి తినుబండారాలు పంపిణీ చేయడం జరిగింది. అంతేగాకుండా భవిష్యత్తులో ఆశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తామని పియస్ఆర్ అండ్ సన్స్ అధినేత పి.సీతారామరావు హామీ ఇవ్వడం జరిగినది.

కార్యక్రమంలో లయన్ ప్రెసిడెంట్ డి.వి.శరత్‌బాబు, సెక్రటరీ డి.సునీల్‌బాబు, ఎం.కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

## “సన్‌యూత్” కవిసమ్మేళనం

నెల్లూరు వర్ధమానసమాజంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా “సన్‌యూత్” సేవా సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సామాజిక అంశాలపై కవిసమ్మేళనం, దేశభక్తి పాటల పోటీలు జరిగాయి. కవిసమ్మేళనంలో కవులు మహబూబ్‌బాషా, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, రామకృష్ణ, బి.ఎస్.ఆర్. ఆంజనేయులు, జి.వి.ప్రసాదులు పాల్గొని కమనీయంగా కవితలు వినిపించారు. గురుదత్తసాయికిరణ్, గజల్ నాగరాజులు దేశభక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. సర్వేపల్లి రామ్మూర్తి సభకు అధ్యక్షత వహించగా సన్‌యూత్ సేవా సంస్థ అధ్యక్షులు ఆబోతుల దశయ్య సభకు ఆహ్వానం పలికారు.

### రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ స్టాఫ్‌నర్స్‌కు
## విశిష్ట సేవా పురస్కారం



రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు విశిష్ట సేవలందించిన స్టాఫ్‌నర్స్ సిస్టర్ కృష్ణవేణికి స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టసేవా పురస్కారం లభించినందుకు రక్తనిధి సిబ్బంది ఆనందోత్సాహాలతో కృష్ణవేణిని ఘనంగా సత్కరించి వేడుక జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సిస్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ రక్తనిధిలో చిత్తశుద్ధిగా సేవలందించిన సిబ్బందిని కన్వీనర్ డా॥ఈదూరు సుధాకర్ గుర్తించి, గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు ఇప్పించడం చాలా సంతోషంగా ఉందని, అదే విధంగా రక్తనిధి ప్రతిష్టను భంగపరిచే విధంగా ఎవరు తప్పుచేసినా, చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పండుగ దినాలలో రక్తనిధి సిబ్బందికి ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. 24గంటలూ బ్లడ్ బ్యాంక్ ప్రతిష్టకై ఎన్నో ప్రక్షాళనలను చేసి రక్తనిధిని ప్రజలకు జవాబుదారీగా నిలబెట్టిన డా॥ఈదూరు సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥డి.పెంచలసుబ్బయ్య, మెడికల్ ఆఫీసర్ డా॥వె.వెంకటేశ్వర్లు, చీఫ్ టెక్నాలజిస్ట్ డి.జీవన్, మోటివేటర్ బొట్టా భాస్కర్‌రావు, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి ఉపాధి పథకాలు అసంతృప్తిగా కొనసాగుతుంటాయి. స్థిరాస్తులు లావాదేవీలందు జాగ్రత్త అవసరం. ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు ఏర్పరచుకొనే ప్రయత్నాలు చేస్తారు. ఇతరులను అపార్థం చేసుకొని బాధపడతారు. ముఖ్య నిర్ణయాల విషయంలో ఇతరులపై ఆధారపడవద్దు. ఉద్యోగులకు పనిభారం ఆందోళన ఉంటుంది. సంప్రదింపులు ముఖ్యపనులు ఒక తీరుకు వస్తాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక ఇబ్బందులనధిగమించే ప్రయత్నాలు సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి ఆదాయం ఉండదు. అయితే ఖర్చులకు తగిన డబ్బు సర్దుబాటవుతుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పైనబడతాయి. బంధువర్గంతో విభేదాలు చోటు చేసుకొంటాయి. చేపట్టిన పనులు సరిగా జరుగక టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయంకాగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక విషయాలలో, ఉద్యోగుల వ్యవహారాలలో సమర్థుల సహకారం తీసుకొనడం మంచిది. పనివాళ్లతో, సహచరులతో సమస్యలు రావచ్చును. వృత్తి జీవనం కలవారికి, వ్యవసాయ దారులకు ఆర్థికంగా సంతృప్తి ఉండదు. వ్యాపారవర్గాలకు అభివృద్ధి, రాబడి ఉంటుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా వేసుకొనడం మంచిది. ఆరోగ్య లోపం ఇబ్బంది కలిగించవచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపారపరంగా రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. కొత్త ఆలోచనలు ప్రయోగాలు వృత్తి వ్యాపారాలలో చూపెడతారు. సంతానం ద్వారా శుభవార్తలు వింటారు. నిరుద్యోగులకు అవకాశాలు లభించవచ్చును. ఉద్యోగులకు పనిభారం, అధికారుల అజమాయిషీ ఎక్కువగా ఉంటుంది. సోదరవర్గానికి మేలు జరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి.



# బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 22.8.2014 నుండి
తేది. 28.8.2014 వరకు

ఈవారం కర్కాటకరాశిలో గురుశుక్రులు, సింహంలో రవిబుధులు, కన్యలో రాహువు, తులలో కుజశనులు, మీనంలో కేతువు, కర్కాటక సింహ కన్యలలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

**ముహూర్తములు లేవు.**

తేది 29 శుక్రవారము "వినాయక చవితి" పర్వదినం.

**శ్రావణమాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | ద్వాదశి | ప॥గం.12.26వ॥ |
| తేది. 23 | శని | త్రయోదశి | ప॥గం.2.38వ॥ |
| తేది. 24 | ఆది | చతుర్థశి | సా॥గం.5.15వ॥ |
| తేది. 25 | సోమ | అమావాస్య | రా॥గం.7.42వ॥ |

**భాద్రపదమాస శుక్ల పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | మంగళ | పాఢ్యమి | రా॥గం.10.03వ॥ |
| తేది. 27 | బుధ | విదియ | రా॥గం.12.15వ॥ |
| తేది. 28 | గురు | తదియ | రా॥గం.4.10వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థికపరమగు ఇబ్బందులు పెరుగుతాయి. అవసరాలకు డబ్బు అందకపోవచ్చును. ఉపాధి పథకాలలో స్థిరపడతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయము స్వల్పంగా పెరుగుతుంది. గృహవస్తు వాహన రిపేర్ల ఖర్చులు పైనబడగలవు. స్త్రీలకు ఆరోగ్యం సరిగా ఉండకపోవచ్చును. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో ఇతరుల సలహాలు తీసుకొనడం మంచిది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి ఉద్యోగ బాధ్యతలలో మార్పులు, అధికారులతో సత్సంబంధాలుంటాయి. వ్యాపారవృద్ధి, ఆదాయము పెరుగుదల బాగుంటుంది. పనులకు కుటుంబసభ్యులు, మిత్రుల మద్దతు బాగుంటుంది. ఆర్థిక నిర్ణయాలలో సలహాలు పాటించడం అవసరం. రావలసిన బాకీలు కొంత లభించడం, కోర్టు కేసులందు అనుకూలత బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు, ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఉద్యోగార్థులకు చిరు అవకాశాలు లభిస్తాయి. క్రొత్త వ్యాపారాలు పరిశ్రమలు ప్రారంభించే ప్రయత్నాలు జరుగుతాయి. దైవకార్యాలు సేవాకార్యములలో చురుకుగా పాల్గొంటారు. ఉద్యోగులు తమ అధికారుల నుండి సహచరుల నుండి ప్రశంసలు సహకారం పొందుతారు. శుభకార్యాలు నిర్ణయంకాగలవు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. నిర్వహించే పనులు ఆటంకాలు లేకుండా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో, కుటుంబ వ్యవహారాలలో సముచిత నిర్ణయాలు తీసుకొంటారు. సోదర వర్గంతో కొంత విభేదాలుండవచ్చును. దూరప్రయాణాలు, కోర్టు కేసులందు అనుకూలత బాగుంటుంది. అనుకోని అదనపు ఖర్చు వారం మధ్యలో పైనబడవచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పనులందు ఆలస్యం, ఆటంకాలు జరగడం ఉండవచ్చును. చిన్న పరిశ్రమదారులు, చిన్న వ్యాపారులకు ఆర్థికస్థితి ఆదాయం బాగుంటుంది. గృహ, వస్తు వాహన రిపేర్లుంటాయి. జలుబు, జ్వరంలాంటి అనారోగ్య బాధలుంటాయి. ఆర్థిక వ్యవహారాలను, కుటుంబ పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. పిల్లల వ్యవహారాలు కొద్ది బాధ కలిగిస్తాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో చొరవ చూపుతారు.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేయవలసిన పనులపై నిర్ణయాలు చేయలేక ఆందోళన ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయము బాగుంటుంది. కుటుంబంలోని వ్యక్తులను అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఏర్పడుతుంది. స్టాక్ రంగాలలో ఒడుదుడుకులుంటాయి. ప్రభుత్వ అనుమతులు పొందడం, పెండింగ్ పనులు ముందుకు సాగడం జరుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో అసంతృప్తి ఉంటుంది.


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న కార్యక్రమాలను సమర్ధవంతంగా జరుపుకొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి ఆర్థికావకా శాలు లభిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. దైవ, సామాజిక సేవలందు పాల్గొంటారు. రావలసిన బాకీలు కొంత వరకు లభిస్తాయి. కొత్త పనులకు ప్రారంభాలు జరుగుతాయి. బంధుమిత్రులకు సహాయం చేయడం, న్యాయపరమైన వ్యవహారాలు రాజీపడటం ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపారంలో ఇబ్బందులు ఆర్థిక సమస్యలుంటాయి. అధిగమించడానికి ప్రయత్నాలు జరుపుతారు. వ్యాపారంలో అవకాశాలు చేజారిపోవచ్చును. అదనపు ఖర్చు లెక్కువగా ఉంటాయి. ఉద్యోగులపై అధికారుల వత్తిడి పనిభారం ఎక్కువగా ఉంటుంది. వస్తువులుగాని, డబ్బుగాని ఇతరులకిచ్చి ఇబ్బందిపడే పరిస్థితి ఉన్నది. అనుకున్న పనులు సక్రమంగా జరగడానికి బాగా ప్రయత్నాలు చేయాలి.

# సిటీ బస్సు కార్మికులకు అండగా వుంటాం

సిటీ బస్సు కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, ఆ కార్మికులకు తమ అండదండలు అందిస్తామని బిజెఎంఎం (భారతీయ జనతా మజ్దూర్ మహాసంఘ్) జిల్లా శాఖ అధ్యక్షులు ఆత్మకూరు వెంకయ్య అన్నారు. ఈ నెల 17న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశానికి మంచి భవిష్యత్తు వుంటుందన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు పి.సురేంద్రరెడ్డి, బిజెఎంఎం నాయకులు గంధం మాలకొండయ్య, బి.సురేష్‌బాబు, బిజెవైఎం నాయకుడు మొగరాల సురేష్, మండ్ల ఈశ్వరయ్య తదితరుల సమక్షంలో పలువురు సిటీబస్సు కార్మికులు బిజఎంఎంలో చేరారు. ఆ తర్వాత, బస్సు కార్మికుల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి అధ్యక్షునిగా ఎన్.చంద్ర, ప్రధాన కార్యదర్శులుగా షేక్ మస్తాన్, రంగయ్య, శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా సురేష్, మాధవ్, చిన్నా, కార్యదర్శిగా కుమార్‌ను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

# మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

## సిపిఎం నేత మాదాల వెంకటేశ్వర్లు


మహిళ సమస్యల పరిష్కారానికి మహిళా సంఘాలు మరింతగా కృషి చేయాలని, మహిళా సంఘాలను ప్రాంతాల వారీగా విస్తృత పరచాలని సిపిఎం నగర కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు సూచించారు. ఈనెల 17న నెల్లూరులో ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) 3వ జోన్ మహాసభ దర్గామిట్టలోని మన్సూర్‌భవన్‌లో జరిగింది. ఈ సభకు మహిళా నేత ఓబుల రమాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాదాల మాట్లాడుతూ మహిళలను రాజకీయంగా మరింత చైతన్యవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పొదుపు మహిళల రుణమాఫీని ప్రభుత్వం వెంటనే అమలుచేయాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా సభ్యులు విజయమ్మ, షాహినాబేగం తదితరులు పాల్గొన్నారు.

# యువజన సంక్షేమానికి నిధులు కేటాయించాలి

రాష్ట్ర ప్రభుత్వం యువజన సంక్షేమానికి నిధులు కేటాయించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువత అభ్యున్నతి కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు కోరారు. నెల్లూరులోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో జరిగిన ఆ శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో యువత అభ్యున్నతికోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పముజుల దశరధరామయ్య, రామరాజు, లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీరహిత బి.సి.సంస్థ లచ్చన్న జీవితాశయం

**- డా॥వై.చైతన్యమురళి, ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమీషనర్**



సీమాంధ్ర విద్యార్థి యువజన జేఏసి ఆధ్వర్యంలో విఆర్‌సి సెంటర్ వద్ద ఈనెల 16న స్వాతంత్ర్య సమర యోధులు డా॥సర్దార్ గౌతులచ్చన్న 105వ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథి డా॥చైతన్యమురళి మాట్లాడుతూ నాడు తెల్లదొరలపైన ఆ తర్వాత అధికార మదం తలకెక్కిన నల్లదొరలపై గౌతులచ్చన్న అవిశ్రాంత పోరాటం జరిపిన వీరుడని, రాజీపడని యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సీమాంధ్ర విద్యార్థి, యువజన జేఏసి రాష్ట్ర కన్వీనర్ ముక్కు రాధాకృష్ణగౌడ్, మాజీ జడ్పీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, నాశిన భాస్కర్‌గౌడ్, కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జునయాదవ్, దాసరి రాజేష్, జానా రామచంద్రయ్యగౌడ్, బెల్లంకొండ చిన్నయ్య, అన్నం దయాకర్‌గౌడ్, పర్వతాల శ్రీనివాసులుగౌడ్, అయితా మల్లిఖార్జునగౌడ్, సమాధి శ్రీనివాసులు యాదవ్, మండ్ల ఈశ్వరయ్య, శాంతమ్మ పాల్గొన్నారు.

## నార్తురాజుపాళెంను దత్తత తీసుకున్న

# యూనియన్ బ్యాంక్

యూనియన్ బ్యాంకు, నార్తురాజుపాళెం గ్రామాన్ని 'యూనియన్ ఆదర్శ గ్రామ పథకం' క్రింద ఈనెల 15న దత్తత తీసుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా 'ఆర్థిక అక్షరాస్యతా శిబిరాన్ని' నిర్వహించింది. ఈ శిబిరానికి గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై బ్యాంకులో లభ్యమయ్యే వివిధ పథకాల గురించి ఆసక్తితో తెలుసుకున్నారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డిప్యూటీ జనరల్ మేనేజర్ ఐ.విశ్వనాథన్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ పరిసర గ్రామాలలో ఇప్పటి వరకూ బ్యాంకు గడప త్రొక్కని ప్రతి కుటుంబాన్ని గుర్తించి ఒక్కొక్క కుటుంబానికి రెండేసి బ్యాంకు అకౌంట్లు ప్రారంభిస్తామని తెలిపారు.

ఈ పథకంలో మొదటి కార్యక్రమంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనపరిచిన నలుగురు విద్యార్థులు కత్తి నీరజ, తాటి అలేఖ్య, దేగపూడి సుప్రియ, వేల్పుల పుష్ప, బల్లి వైష్ణవిలకు ఒక్కొక్కరికి నాలుగువేల రూపాయల చెక్కులను డి.జి.యం ఐ.విశ్వనాథన్ చేతుల మీదుగా అందించారు.


ఓం నారాయణ ఆదినారాయణ ఓం నారాయణ ఆదినారాయణ ఓం నారాయణ ఆదినారాయణ



గొలగమూడి భగవాన్
శ్రీ వెంకయ్యస్వామివారి
32వ ఆరాధన మహోత్సవ ఆహ్వానము

2014 ఆగస్టు 18 నుండి 24 వరకు

22-8-14 రా॥ 9-00గం.లకు పెదశేష వాహనసేవ
23-8-14 రా॥ 9-00గం.లకు గరుడవాహనసేవ

24-8-14 ఆదివారం ఆరాధన మహోత్సవము

ఉ॥ 9-00గం.లకు సర్వేపల్లి శాసనసభ్యులు శ్రీ కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులచే శ్రీ స్వామివారికి పట్టు వస్త్రముల సమర్పణ
ఉ॥ 10-00గం.లకు రథోత్సవము
రా॥ 8-00గం.లకు తెప్ప మహోత్సవము

ప్రతిరోజు విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించబడును. నిరంతరం అన్నదానం జరుగును.

కావున భక్తులెల్లరు ఈ మహోత్సవాలలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీ స్వామి వారి కృపాకటాక్షములకు పాత్రులు కావలెనని కోరుచున్నాము.


ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ & మెంబర్ సెక్రటరి
భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమము, గొలగమూడి,
ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా - 524321. ఫోన్. 0861-2161105.

ఆకలై కొంగుపట్టే వారికి అన్నం పెట్టాలయ్యా - ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు శివారెడ్డి వెంకటరమణారెడ్డి - పార్వతిల కుమార్తె **సాయి సుప్రియ - రాజారాఘవేంద్రరెడ్డి** ల పరిణయం ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు ఘనంగా జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్‌క్యాస్ట్ లిమిటెడ్, గూడూరు ఏజిఎంహెచ్ఆర్ తాడేపల్లి మురళీకృష్ణ - రమాసుందరిల కుమార్తె **డా॥ నాగశ్రీవిద్య - డా॥ చైతన్య** ల పరిణయం ఈ నెల 13వ తేదీ గుంటూరులోని గ్రాండ్ కార్తికేయ ఫంక్షన్‌హాల్‌లో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# గాడిన పడని పాలన

(మొదటిపేజీ తరువాయి)

ఏ పథకం మీద స్పష్టత లేదు... ఋణమాఫీని మెడకు తగిలించుకుని రోజులో ఎక్కువగంటలు దాంతోనే కుస్తీ పడుతున్నాడు. ఏ మంత్రినీ నమ్మడం లేదు. దాంతో మంత్రులు వేగంగా ముందుకు పోలేకపోతున్నారు. తెలంగాణ మంత్రులతో పోలిస్తే ఆంధ్రా మంత్రులు చాలా వెనకబడి ఉన్నారు. ఇక వారానికి మూడురోజులు విజయవాడలోనే ఉంటానన్న చంద్రబాబు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. తాను సీఎంగా ఉన్నంతకాలం హైదరాబాద్‌ను వదిలి పెట్టాలను కోవడం లేదు. విజయవాడను తాత్కాలిక రాజధానిగా ప్రకటించాదేగాని, అక్కడ తానుంటానని చెప్పడం లేదు.

ఇక ముఖ్యమంత్రి హోదాలో ఆయన తన రాష్ట్రం లోనే ఆయా ప్రాంతాలపై పక్షపాతం చూపుతున్నాడు. తమ పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చిన జిల్లాల్లోనే పరిశ్రమలు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు చెబుతున్నాడు. కాని ఆ జిల్లాలు పరిశ్రమల ఏర్పాటుకు అనువైనవి కాకపోవడంతో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి పోతున్నాయి. ఆ విధంగా మన రాష్ట్రానికి అన్యాయం జరుగుతోంది. ఇక తన పాత పరిపాలనా విధానాన్ని ఆయన మార్చుకోవడం విమర్శలకు తావిస్తుంది. తన పాలనపై రాజకీయ ముద్ర ఉంటుందని, ఎమ్మెల్యేలు, నాయకుల సిఫారసులకు ప్రాధాన్యతనిస్తానని బహిరంగంగా చెప్పారు. ఇది ప్రభుత్వ వ్యవస్థలను విచ్ఛిన్నం చేసే ప్రక్రియ. ఒక ఎస్ఐ, సిఐ లేదా డిఎస్పీ పోస్టింగ్ కోసం ఒక ఎమ్మెల్యే గడప తొక్కితే, ఇక అతను సదరు ఎమ్మెల్యేకు సేవ చేయడానికే సరిపోతుంది కాని ప్రజలకు ఏం సేవ చేస్తాడు. ఈ విషసంస్కృతికి గత కాంగ్రెస్ ప్రభుత్వంలో బీజం పడింది. అదే సంస్కృతిని తానూ కొనసాగిస్తానని చంద్రబాబు చెప్పడం వ్యవస్థలను భ్రష్టు పట్టించడమే.

ఆంధ్రప్రదేశ్ కష్టాల్లో ఉంది. కాని అభివృద్ధి చెంద డానికి అన్ని మార్గాలున్నాయి. సీఎంగా చంద్రబాబు తన రాష్ట్రం కోసం కసిగా పనిచేయాలి. కులం, ప్రాంతం వంటి విషబీజాలను వదిలి రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సమర్ధవంతమైన పాలన అందించే దిశగా కృషి చేయాలి. ముఖ్యంగా హైదరాబాద్ పిచ్చిని, తెలంగాణలో పార్టీకి అధికారం అనే భ్రమను వదులుకోవాలి.

## కమిషనర్‌గా ఓబులేశు?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు కొత్తగా రానున్న కమీషనర్ పోస్టింగ్ కోసం నారాయణ అనుంగ శిష్యుడితో మరో పైరవీకారుడు చేతులు కలిపి పాతికలక్షలకు డీల్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. అత్యంత రాబడి కలిగిన నెల్లూరు కార్పొరేషన్ కమీషనర్ పోస్టింగ్‌కి పాతికలక్షలంటే చౌకే!

ప్రస్తుతం ఫైల్ శరవేగంగా కదులుతున్నట్లు వార్త. రాబోయేవారు ఈ పాతికకు ఎన్ని పాతికలు కలిపి సంపాదించాలనుకుంటున్నాడో ఆ నారాయణుడికే తెలియాలి. ఇక నెల్లూరు కార్పొరేషన్ బాగుపడడం కలగానే మిగిలిపోయేటట్లుంది. నెల్లూరుజిల్లా వాడైన వెంకయ్యనాయుడు కేంద్రంలో పట్టణాభివృద్ధిశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న తరుణంలో నెల్లూరు మున్సిపాలిటీకి ఐఎఎస్ అధికారి కమిషనర్‌గా వస్తాడని, చంద్రబాబు సామ్రాజ్యంలో నెం.2గా వెలుగుతున్న నారాయణ మునిసిపల్ మంత్రిగా వున్న సమయంలో నెల్లూరు రూపురేఖలు మారిపోతాయని, రానున్న రోజుల్లో ఆదర్శనగరంగా నెల్లూరును చూసు కోవచ్చని నెల్లూరీయులు కలలు కంటున్నారు. వారి కలలు చెదిరిపోనీయకుండా ఇప్పటికైనా వెంకయ్య నాయుడు గారు దృష్టి సారించి ఐఎఎస్ స్థాయి అధికారిని నెల్లూరు కమిషనర్‌గా నియమింపజేస్తారని నెల్లూరీయుల ఆశ... ఆకాంక్ష!

## 24న 'ఆంధ్రకళావైభవం'

నెల్లూరు పురమందిరంలో ఈనెల 24న ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో "ఆంధ్ర కళావైభవం" సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. కార్యక్రమంలో గురుకృప కళాక్షేత్రం వారిచే స్వాగతనృత్యం, ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల వారిచే కూచిపూడినృత్యం, గురుకృప సంగీత విద్యాలయం చిన్నారులచే "తెలుగు పాట – బాలల నోట" ప్రదర్శించిన పిమ్మట సభాకార్యక్రమం జరుగుతుంది. తదుపరి శ్రీకృష్ణరాయభారం (పడకసీను) ప్రదర్శన వుంటుంది.

సభలో ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షులు శ్రీమతి వి.ఎల్.ఇందిరాదత్, విక్రమసింహపురి విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.రాజారామి రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సమాఖ్య ప్రాంతీయ కమిటీ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, వైస్‌ఛైర్మెన్ వి.హజరత్ బాబులు పాల్గొంటారు. తెలుగు వారికే సొంతమైన కళలను ప్రోత్సహిస్తూ ప్రదర్శిస్తున్న ఆంధ్రకళా వైభవాన్ని అందరూ తిలకించాలని ప్రపంచ తెలుగు సమాఖ్య కోరుతోంది.

# మా రోడ్డు మాకే ముద్దు.. మీ కంపు మాకు వద్దు!

## మునిసిపల్ రోడ్డును సొంత ఖర్చులతో వేసుకుంటున్న మాగుంట లే అవుట్ వాసులు




నెల్లూరు నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన లే అవుట్ "మాగుంట లే అవుట్" లే అవుట్ అభివృద్ధి కోసం కొత్తగా ఏర్పడిన "లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్" శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నప్పటికీ ఇంకా పలురోడ్లు మట్టిరోడ్లుగానే మిగిలిపోయాయి.

మునిసిపల్ అధికారులతోనూ, నయవంచక పాలకులతోనూ విసిగివేసారిన లే అవుట్‌లోని ఓ రోడ్ నివాసితులు తమ స్వంత ఖర్చుతో రోడ్డువేసుకుని ఎంతో మందికి ఆదర్శంగా నిలవడమే కాకుండా అటు అధికారులకు ఇటు పాలకులకు బుద్ధి వచ్చేలా చేస్తున్నారు.

మాగుంట లే అవుట్‌లోని 1(ఫస్ట్) క్రాస్ రోడ్డులో దాదాపు 325 అడుగుల పొడవు, 16 అడుగుల వెడల్పుతో ఆ రోడ్డులో నివాసముంటున్న వాళ్ళంతా, బసిరెడ్డి సురేంద్రరెడ్డి సారధ్యంలో చందాలు వేసుకొని సిమెంటురోడ్డు నిర్మాణం చేపట్టారు. దాదాపు 4లక్షల వ్యయంతో తమ రోడ్డు తామే వేసుకుంటున్నాం కాబట్టి కక్కుర్తి కాంట్రాక్టర్లలా వ్యవహరించకుండా అత్యంత నాణ్యత ప్రమాణాలతో రోడ్డును నిర్మించుకుంటున్నట్లు అక్కడ నివాసితులు చెప్తున్నారు. అధికారులతో, ప్రజా పాలకులతో విసిగి వేసారి తమ రోడ్డును తామే బాగుచేసుకుంటున్నట్లు వారు చెప్తున్నారు.

ఇది చాలా మంచి పరిణామం. ఇంటి పన్నులంటూ అధికారులు కాని, ఓట్లేయండి బాబు.. అంటూ పాలకులుగాని ఈ రోడ్డులోకి రావద్దని ఓ బోర్డు కూడా పెడితే బాగుంటుంది.

## వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు




నెల్లూరుజిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా వెలుగొందుతున్న గొలగమూడిలో ప్రతి ఏటా జరిగే వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 18న ప్రారంభమై వైభవంగా జరుగుతున్నాయి. ఎక్కడెక్కడినుండో వస్తున్న భక్తుల కోలాహలంతో గొలగమూడి కళకళలాడుతోంది. ముఖ్యంగా ముగింపురోజైన 24వ తేదీ జరగబోతున్న రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివస్తారని అంచనావేస్తున్నారు.

తిరుమలలో వెంకటేశ్వరస్వామి భక్తులలాగా ఏటికేటికీ వెంకయ్యస్వామి భక్తుల రాక పెరిగిపోతోంది. ఆయన సూక్తులు, మానవీయ కోణమే ఇందుకు కారణం కావచ్చు.

## కాలధర్మం

# దొడ్ల చెంచురామిరెడ్డి



ప్రముఖ పారిశ్రామికవేత్త దొడ్ల చెంచురామిరెడ్డి ఆగష్టు 16వతేదీ తన 93వయేట పరమపదించారు. చెంచురామిరెడ్డి రైతు కుటుంబానికి చెందినవాడైనప్పటికి నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్‌గా మారి అనంతరం 1970లో తన మిత్రులు డా॥జె.నారాయణయ్య, న్యాయవాది నరసింహారావు, జి.సి.కొండయ్యలతో కలసి కపర్తి (స్ట్రాబోర్డ్స్) అట్టల ఫ్యాక్టరీని నిర్మించారు. కొద్దికాలం తరువాత చెంచురామిరెడ్డి తన కుమారుడు దొడ్ల శేషారెడ్డికి వ్యాపారబాధ్యతలు అప్పజెప్పి విశ్రాంత జీవితం వైపు మొగ్గుచూపారు.

దర్గామిట్టలోని జడ్‌పి పాఠశాలలో భవన నిర్మాణం కోసం తనవంతు సహాయసహకారాలు అందించడంతో పాటు గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కు ప్రాంగణంలో తన శ్రీమతి దొడ్ల పద్మావతమ్మ పేరుపై మహిళా గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయడానికి భవనాన్ని తన స్వంత ఖర్చుతో నిర్మించి ఇచ్చారు. మినిబైపాస్ రోడ్డులో కూడా తన శ్రీమతి దొడ్ల పద్మావతమ్మ పేరుపై ఓ కమ్యూనిటీ హాలు నిర్మించి సామాన్యులు సైతం ఇక్కడ కళ్యాణాలు, శుభకార్యాలు చేసుకోవడానికి వీలుగా అతి తక్కువ అద్దెతో అందిస్తూ ఈ కమ్యూనిటీ హాలును ప్రజలకు అంకితం చేశారు.

కొంత కాలం అనారోగ్యంగా వున్న చెంచురామిరెడ్డి 16వతేదీ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య పద్మావతమ్మ, కుమారుడు శేషారెడ్డి, కుమార్తె శాంతమ్మ వున్నారు. వారి కుటుంబ సారధ్యంలోనే గతంలో సర్కార్ పేపర్ మిల్స్ నిర్వహించబడుతుండగా, ప్రస్తుతం మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా పునాదులేసుకుంటున్న "దొడ్ల డైరి" కూడా వీరిదే. చెంచురామిరెడ్డి మనుమళ్ళు దొడ్ల సుబ్బారెడ్డి, దొడ్ల సునీల్‌రెడ్డిలతో పాటు వారి మనుమరాలు సురేఖారెడ్డి వివిధ రంగాలలో తమ ప్రతిభా పాటవాలతో ప్రసిద్ధిచెందిన వారే. చెంచురామిరెడ్డి గారి కుటుంబసభ్యులకు వారి సతీమణి శ్రీమతి పద్మావతమ్మకు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటూ ప్రగాఢసానుభూతి తెలుపుతోంది "లాయర్".

# గూడూరు డివిజన్ వార్తలు

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు


జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆర్డీవో కె.శ్రీనివాసరావు

గూడూరు పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం వద్ద ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జెండావందనం చేశారు. గూడూరు పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. పట్టణంలో ఉండే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు, కమీషనర్ అనురాధ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, సబ్‌జైలులో డియస్‌పి కార్యాలయంలో ప్రాంతీయ వైద్యశాలలో, రోడ్లు భవనాల, పంచాయతీరాజ్, ఒకటవ, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లులో తదితర కార్యాలయాల వద్ద అధికారులు జెండ వందన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ బొమ్మకు వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, తెలుగుదేశం నాయకులు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు పూలమాలలు వేశారు.


మున్సిపల్ ఆఫీసులో జెండా వందనం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకాదేవసేన, కమీషనర్ అనురాధ

## డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈ నెల 15వ తేదీ జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో కనుమూరు హరిచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ కాలేజీలో చదువుకొనే ప్రతి విద్యార్థి ఒక ఐఎఎస్, ఐపియస్ కావాలని కోరారు. తను సంపాదించే ప్రతి రూపాయిలో అర్థ రూపాయి తాను చేసే సేవా కార్యక్రమాలకు ఖర్చు పెడతానన్నారు. డిఆర్‌డబ్ల్యు కళాశాల ఇంత అభివృద్ధికి కారణమైన అల్లారెడ్డి శ్యాంసుందరరెడ్డిని, డాక్టర్ సిఆర్‌రెడ్డిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె.మునిగిరీష్ కాలేజీ డైరెక్టర్ వై.శ్యామలమ్మ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎమ్.స్వరూపాదేవి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కె.వర్ధనమ్మ కాలేజీ అధ్యాపకులు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న హరిచంద్రారెడ్డి, ప్రక్కన డాక్టర్ సి.ఆర్.రెడ్డి

ఖైదీలకు శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో...

## మిఠాయిలు పంపిణీ


ఖైదీలనుద్ధేశించి మాట్లాడుతున్న మయూరిశ్యాంయాదవ్

గూడూరు సబ్ జైలులో ఆదివారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఖైదీలకు శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి వుండాలని సంస్థ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మయూరిశ్యాంయాదవ్, జైలు సూపరింటెండెంట్ అస్లాం, సభ్యులు సుధాకర్, పుల్లయ్య, మురళీకృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు


మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ నారాయణ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గూడూరు నరసింహారావు పేటలో ఉన్న బాలసదన్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ నారాయణ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దంతాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రియాజ్‌అహ్మద్, అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌నాయుడు, నవీన్ జయకుమార్, మాజీ ఎంపిపి మల్లు విజయకుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ కడివేటి చంద్రశేఖర్, శ్రావణ్, రాధాకృష్ణారెడ్డి, ఎం.మురళీరెడ్డి పాల్గొన్నారు.


ఈ నెల 15న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలలో రాష్ట్ర మంత్రి పి.నారాయణ చేతుల మీదుగా అవార్డులనందుకుంటున్న గూడూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, గూడూరు మున్సిపల్ ఆఫీసు సీనియర్ అకౌంటెంట్ చెముకుల సురేష్, గూడూరు మున్సిపల్ ఆఫీసు శానిటరీ మేస్త్రి మాదాబత్తల లక్ష్మణరావు

# కల్యాణ వైభవం...!


నెల్లూరీయుడు, భద్రాచలం ఐటిసిలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న కందికట్టు చంద్రశేఖర్ - సునీతల కుమార్తె **సుష్మాదేవి - వెంకట సుధీర్‌కుమార్** ల వివాహం ఈ నెల 15వ తేదీ హైదరాబాద్‌లోని రాడిసన్ బ్లూప్లాజా హోటల్‌లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.


నెల్లూరుకు చెందిన వ్యాపారవేత్త యేల్చూరి శ్రీనివాసరావు - లక్ష్మీకుమారిల కుమారుడు **వెంకట గిరీష్‌కుమార్ - శ్రీరేఖ** (విజయవాడ వాస్తవ్యులు సంకా జనార్ధన్‌రావు - భవానిల కుమార్తె)ల పరిణయం ఈ నెల 16వ తేదీన విజయవాడలో ఘనంగా జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనలు.


మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి మాజీమేనేజర్ పత్తిపాటి శ్రీనివాసులు - మల్లీశ్వరిల కుమారుడు **చైతన్య - శ్వేత** (నెల్లూరు వాస్తవ్యులు యడవల్లి మల్లికార్జునరావు - జ్యోతిల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 16వ తేదీ నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.


ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ రావూరు విఠల్‌రావు-హిమబిందుల కుమార్తె **సింధు - కార్తీక్** (విజయవాడ వాస్తవ్యులు కమతం వరప్రసాదరావు - స్వర్ణలతల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 14వ తేదీన నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# శ్రద్ధాంజలి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాలలో వెలిగే ధృవతార, మాకు మార్గదర్శకులు, అనురాగమూర్తి

## కీ॥ శే॥ శ్రీ గునుపాటి సుబ్బరామిరెడ్డి గారు

(కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం)

పరమపదించి ఆగస్టు 27, 2014 నాటికి 24 సంవత్సరాలు నిండుతాయి
ఆ మహనీయమూర్తిని సంస్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి చేకూరుటకై ప్రార్థిస్తున్నాము.

అర్ధాంగి: **గునుపాటి రుక్మిణమ్మ**

కుమారులు - కోడళ్ళు

**గునుపాటి వెంకటకృష్టారెడ్డి - ఇందిరమ్మ**
**గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ**
**గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ**

కుమార్తెలు - అల్లుళ్ళు

**కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥ శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి**
**అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి**
**దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభరెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com